తిరుపతి - చిత్తూరు
30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## రెండు వాహనాలు ఢీ : రెండు కార్లు దగ్ధం



రైల్వేకోడూరు రూరల్ మే 19, ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలం బాలుపల్లె అటవీశాఖ తని ఖీ కేంద్రం వద్ద మంగళవారం ఉదయం రెండు వాహనాలు ఢీకొని పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చెక పోస్ట్ వద్ద వద్ద ఉదయం తిరుపతి వైపు నుంచి కడప వైపు వెళుతున్న కారు మరమ్మతులతో ఆగిపోయిన లోడు లారీ వెనుక భాగంలో ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొద్ది గంటల సమయంలో ప్రమాదం జరిగిన ప్రదేశానికి మరొక కారు వచ్చి ఇంజన్లో పొగలు రావడంతో ప్రమాదానికి గురైన కారు పక్కనే ఆపివేయడంతో కొద్దిసేపటికి ఆ కారులో మంటలు చెలరేగి లారీని ఢీకొన్న కారుకు మంటలు వ్యాపించి రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. లారీ వెనుక టైర్లు కూడా కాలడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే రెండు కార్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## వేసవి సెలవుల్లో విషాదం

### విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



చంద్రగిరి, మే 19 ప్రభాతవార్త:

వేసవి సెలవుల్లో సంతోషంగా గడిపేందుకు తన మేనత్త ఇంటికి వచ్చిన బాలుడు మృత్యువాత పడటంతో భరించలేని విషాధం నెలకొన్నది. వివరాల్లోకెళితే.. రామచంద్రాపురం మండలం, యాగ ప్పరెడ్డి కండ్రిగ (మూల సపర్లు) గ్రామానికి చెందిన బాదూరు అర్జున్ రెడ్డి కుమారుడు బాదూరు పునీత్‌రెడ్డి వేసవి సెలవులకు చంద్రగిరి మండలం, ఏ.రంగం పేటలోని తన మేనత్త ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బాలుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్ళినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఆ రెండు కుటుంబాలలో కాకుండా రెండు గ్రామాలలో విషాధఛాయలు అలుముకున్నాయి. బాలుడి మృతదేహాన్ని సొంతూరుకు తరలించి, బుధవారం అంత్యక్రియలు నిర్వహించాడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## వైభవంగా శ్రీ తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు





అమ్మవారి శిరస్సు తెర తొలగిస్తున్న దృశ్యం, అమ్మవారి శిరస్సు ఊరేగింపు

**- వెండినాగపడిగతో ప్రత్యేక అలంకారం..**
**వర్షంలోను అమ్మవారి ఊరేగింపు !!**
**- జనసంద్రంలా మారిన కుప్పం !!**

కుప్పం, మే 19 ప్రభాతవార్త

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి.. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ తల్లి.. అందునా అమ్మవారి శిరస్సు ఊరేగింపు.. ఈ వేడుకలు తిలకించేందుకు భక్తజన కోటి అశేష రీతిలో హాజరయ్యారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఈ జాతరను తిలకించేందుకు రెండు కళ్ల చాలవనే రీతిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విలువైన ఆభరణాలతో అమ్మవారిని ఈసందర్భంగా అలంకరించారు. తొలిసారిగా అమ్మవారికి 30కిలోల వెండి నాగపడిగతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5గంటల నుంచే పాతపేట ప్రాంతం జనసంద్రంగా మారిపోయింది. అమ్మవారి శిరస్సు కళ్లకు తెర తొలగించిన అనంతరం అమ్మవారి శిరస్సు ఊరేగింపు మొదలైంది. ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ స్వయంగా అమ్మవారి ఉత్సవాన్ని మోశారు. గాండ్లవీధి, మునస్వామిపురం, నేతాజీ రోడ్డు, చిత్తరంజన్ రోడ్డు, టిబి రోడ్డు, కొత్తపేట, తపాలరాజు వీధి, ప్యాలస్ రోడ్డు, సోమయ్య వీధి, పైబాట తదితర ప్రాంతాల మీదుగా అమ్మవారి శిరస్సును ఊరేగించారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారికి జంతుబలులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ వాసులే కాక వివిధ గ్రామీణ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు అమ్మవారికి బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకోవడం కన్పించింది. ఈసందర్భంగా రహదారులన్నీ రక్తసిక్తంగా మారాయి. పలువురు తమ చిన్నారులను అమ్మవారి శిరస్సు వద్ద ఉంచిమొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం సాయంత్రం వర్షం మొదలుకావడంతో అమ్మవారి ఊరేగింపు వర్షంలోను కొనసాగింది. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా పట్టణంలో జనం సందడి అధికంగా కన్పించింది. వేల సంఖ్యలో భక్తులు కుప్పం పట్టణం చేరుకోవడం కన్పించింది. అమ్మవారి ఆలయం, శ్రీ ముత్తుమారెమ్మ ఆలయ విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, స్థానిక నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

## నేడు సిఎం చంద్రబాబు కుప్పం రాక

### శ్రీ తిరుపతి గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పణ!!



కుప్పం, మే 19 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతరకు బుధవారం విచ్చేస్తారు. బుధవారం ఉదయం ఉండవల్లి నివాసం నుంచి సిఎం హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం తుమ్మిశి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం కుప్పంలోని శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి దర్శనంకోసం సిఎం దంపతులు హాజరవుతారు. అమ్మవారికి సిఎం చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం శివపురంలోని తమ స్వగృహంకు వెళ్లి మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో బెంగళూరుకు హెలికాప్టర్‌లో బయల్దేరుతారు.

## తామరపూల అంకరణలో తాతయ్యగుంట గంగమ్మ



తిరుపతి, మే 19ప్రభాతవార్త:

తిరుపతి గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర తరువాత తొలిమంగళవారం బంగారు వజ్ర కిరీటం, తామర పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దర్శనమిచ్చారు. ఆలయం మొత్తం తామర పువ్వులతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు. రానున్న నాలుగు మంగళవారాలు గంగమ్మ పలు రకాలుగా దర్శనమివ్వనున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవారిని చిన్నారులు, పెద్దలుగంగమ్మను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఈఓ ఎ.జయకుమార్, కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులకు ప్రశాంత దర్శనం చేయిస్తున్నారు.

### తాతయ్యగుంట గంగమ్మ సేవలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని



తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారమందిస్తామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం తోలివారం గంగమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ పాలకమండలి సభ్యులు, ఆలయ ఈఓ ఎ. జయకుమార్ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి అనగానితో తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ్మ, తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొ రేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్రమీడియా కోఆర్టినేటర్ బి.శ్రీధర్ వర్మ, టిడిపి నేతలు పులిగోరు మురళీకృష్ణా రెడ్డి, తోట వాసుదేవ్ యాదవ్, మునిరామయ్య, వినుకొండ లక్ష ్మణరావు, కిశోర్

## రూ.కోటి విలువైన 500 మొబైల్ ఫోన్లు రికవరీ



తిరుపతి, మే 19ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా పోలీసులు "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమంలో 14వ దశలో భాగంగా సుమారు ఒక కోటి రూపాయలు విలువైన 500 మొబైల్ ఫోన్లను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వివరాలను వెల్లడించారు. ఇంటి వద్దనుండే సిఇఐఆర్ సేవల ద్వారా ఫిర్యాదు నమోదు చేసి తమ మొబైల్ ఫోన్లను తిరిగి పొందే అవకాశం కల్పించామని తెలిపారు. తిరుపతి జిల్లా పోలీసులు ఆంధ్రప్రదేశ్‌తో బాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ ,మహారాష్ట్ర రాష్ట్రాల నుండి కూడా మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు సిఇఐఆర్ సేవలను పొందేందుకు 9490617873 వాట్సాప్ నంబర్‌కు హై అని మెసేజ్ పంపడం ద్వారా సిఇఐఆర్ లింక్‌ను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ నంబర్ ద్వారా సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడానికి అవసరమైన పూర్తి మార్గదర్శకం ,సాంకేతిక సహాయం అందించబడుతుందని వివరించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

## తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

4లో



## బజారున పడ్డ పోలీసు శాఖ పరువు

**ఇటీవల కాలంలో ఒక ఇన్స్‌పెక్టర్, ఒక ఎఎస్ఐ, ఒక ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు**
**- ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఘటనలు**

చిత్తూరు, మే 19 ప్రభాతవార్త:

జిల్లా జరుగుతున్న వరుస ఘటనలతో పోలీసు శాఖ పరువు బజారున పడుతోంది. జిల్లా కేంద్రంలో ఎస్పీ వుంటున్న కూత వేటు దూరంలో వున్న పోలీస్ స్టేషన్లలో పోలీసు అధికారులు అత్యాశకు వెళ్ళి లంచాల రూపంలో దండుకుంటుండటంతో పోలీసుశాఖ అంటేనే చులకన అయ్యింది. ఇటీవల కాలంలో ఒక సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌తో పాటు నిన్నటికి నిన్న ఒక ఎఎస్ఐ, ఒక ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. జిల్లా పోలీసు శాఖలో నిజాయితీ కల్గిన అధికారులు వున్నప్పటికీ కొంతమంది చేస్తున్న తప్పుడు పనులతో ఆ శాఖ తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. చిత్తూరు వన్‌టౌన్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి ఇటీవల క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో బెట్టింగ్‌లకు పాల్పడే ముఠాను తప్పించ చడానికి వారి నుండి రూ.10 లక్షల వరకు లంచంగా తీసుకున్నారని ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారంపై విచారణ నిర్వహించి పోలీసు అధికారులు ఆ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ బెట్టింగ్ వ్యవహారంలో మరికొంది అధికారుల పాత్ర వుందని వీరిపై సైతం విచారణ సాగుతోందని తెలుస్తోంది. అలాగే నిన్నటికి నిన్న తమిళనాడు రాష్ట్రం నుండి జిడినెల్లూరు పరిసర ప్రాంతాల్లో టెంకాయలు కొనుగోలు చేసి వ్యాపారం చేయడానికి వచ్చిన మంజునాధన్ అనే వ్యక్తిని చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధుల నిర్వహించే లోకనాథం, ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే రవిచంద్రలతో పాటు ఇద్దరు స్థానికులు, తమిళనాడు రాష్ట్రంకు చెందిన మరొక ఇద్దరు ఏకమై బెదిరించారు. తమిళనాడు రాష్ట్రం నుండి ఇక్కడికి నకిలీ నోట్లు తీసుకు వచ్చి సరఫరా చేస్తున్నాడని, ఈ విషయంపై కేసు నమోదు చేస్తామని మంజునాధన్ అనే వ్యాపారిని ఎఎస్ఐ, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు నలుగురు బెదిరించారు. భయపడిన తమిళనాడు టెంకాయల వ్యాపారి తన వద్ద వున్న రూ.9.40 లక్షల రూపాయలను అక్కడికక్కడే వదలి వేసి పారిపోయాడు. తమిళనాడు వ్యాపారి వదలి వెళ్ళిన డబ్బును దోచుకున్న ట్రాఫిక్ ఎఎస్ఐ, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్ళు ఇంటి దారి పట్టారు. అయితే పారిపోయిన తమిళనాడు వ్యాపారి తనకు వున్న పలుకుబడితో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనపై విచారణ నిర్వహించిన పోలీసులకు తమ శాఖకు చెందిన ట్రాఫిక్ ఎఎస్ఐ లోకనాధం, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రవిచంద్రలు ఈ కేసులో నిందితులని తేల్చి కేసు నమోదు చేశారు. ఈ మేరకు వీరిద్దరిని ఎస్పీ తుషార్ డూడి సస్పెండ్ చేశారు. జిల్లాలో పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిని మర్యాదతో మాట్లాడాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులకు ప్రతి నెల జరిగే క్రైమ్ మీటింగ్‌లో చెప్తున్నప్పటికీ కొంతమంది పోలీసు అధికారులు మాత్రం ఎస్పీ మాటలను పెడచెవిన పెట్టి తమ దారిలో తాము వెళ్ళి శాఖకు చెడ్డపేరు తీసుకువస్తున్నారు.

## ఘనంగా మత్స్యకార సేవ కార్యక్రమం

**వర్చువల్‌గా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,**
**తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి హాజరైన మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్..**

తిరుపతి కార్పొరేషన్, మే 19 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మత్స్యకార సేవ విడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని, మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివరించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో తిరుపతి జిల్లాకు చెందిన పలువురు శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎస్పీ, జేసి, కార్పొరేషన్ ఛైర్మన్ లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సప్లమెంటరీకీ సర్వం సిద్ధం

**పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలి**
**రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ప్రారంభం**
**జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు**
**హాజరుకానున్న 34380మంది విద్యార్థులు**



తిరుపతి విద్య మే 19 ప్రభాతవార్త

జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 4వ తేదీవరకు జరగనున్న పరీక్షలకు రికార్డు స్థాయిలో అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్నారు. సాధారణ జనరల్ పబ్లిక్ పరీక్షలను తలపించేలా సప్లిమెంటరీ పరీక్షలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా వ్యాప్తంగా 34380మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రధానంగా సబ్జెక్టులు తప్పిన విద్యార్థులతో పాటు ఫస్ట్, సెకండ్ ఇయర్లలో మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులకు ఇంప్రూవ్మెంట్ అవకాశం ఇవ్వడంతో భారీ ఎత్తున సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు ధరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

### 52 పరీక్షా కేంద్రాలు...34380మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 34380 మంది హాజరుకానున్నారు. ఇందులో ఫస్ట్ ఇయర్ జనరల్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు 22,213 మంది కాగా, ఒకేషనల్ పరీక్షలకు 639మంది హాజరుకానున్నారు. అలాగే సెకండ్ ఇయర్ జనరల్ పరీక్షలకు 11,702 మంది, ఒకేషనల్ పరీక్షలకు 465 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

### అర గంట ముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలి

జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 52 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. పిచ్చాటూరు, నాగలాపురం, నాయుడుపేట ప్రాంతాల్లోని మూడు కేంద్రాలను సమస్యాత్మక పరీక్షా కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణ కోసం మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, ఆరు సిట్టింగ్ స్క్వాడ్లు పర్యవేక్షణ చేపడతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 08772237200 నంబర్‌కు సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## విజయకుమార్ సేవలు పార్టీకే పరిమితమా?!



**ఒక్కొక్కరికి నామినేట్, పార్టీ పదవులు: మరి కొందరికి అసంతృప్తి**

శ్రీకాళహస్తి, మే 19 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న వారికి పదవులందించటంలో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆచి తూచి అడుగులేస్తున్నారు. పార్టీని నమ్ముకున్న వారి ఇంటి తలుపులు తట్టి నామినేటెడ్ పదవులు వస్తాయని పదే పదే ప్రకటిస్తూ వివిధ సమీకరణలతో పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు అందిస్తున్నారు. గతంలో అయితే ఒకే పార్టీ ఉన్న పదవలన్నీ తమ అనుచరులకే అందించే వారు. అయితే ప్రస్తుతం పార్టీలో పరిస్థితి కూటమి కాబట్టి అందరిని సంతృప్తి పరచాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కొంత ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసన సభ్యుడుగా ఉన్నప్పటి నుంచి పార్టీలో ఉన్న ప్రస్తుత తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సేవలో పార్టీకే పరిమితమా? అనే చర్చ ఆయన అనుచరుల్లో చోటు చేసుకుంది.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జి విజయకుమార్ నాయుడు సుమారు 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటున్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో 19 వార్డు కౌన్సిలర్‌గా గెలిచిన జి.విజయ కుమార్ నాయుడు ఛైర్మెన్ పదవి అలంకరిస్తారని భావించారు. అయితే వివిధ సమీకరణలు, సామాజిక అంశాలతో పాటు ఆయన కన్నా సీనియర్‌గా ఉన్న పేట రాధారెడ్డికి ఛైర్మెన్ కుర్చీ దక్కింది. అప్పటిలో ఈ మున్సిపాలిటిని ఓసిలకు కేటాయించగా బిసి అభ్యర్థిని ఎన్నుకో జేసారు. అప్పటిలో వైస్ ఛైర్మెన్‌గా ముత్యాల పార్థసారధిని నియమించారు. రాధారెడ్డి పదవిలో ఉంటూ మూడేళ్ళకు అనారోగ్యంతో మృతి చెందగా మరో సారి విజయకుమార్‌పేరు తెర మీద వచ్చింది. అయితే రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అప్పటిలో ముత్యాల పార్థసారధిని ఛైర్మెన్ చేస్తూ రాధారెడ్డి సామాజిక వర్గానికి వైస్ ఛైర్మెన్ సీటును అందించారు. అయితేఆ ఐదేళ్లు విజయకుమార్‌నాయుడు అధికార పార్టీ నాయకుడుగానే కొనసాగారు. అయితే కౌన్సిల్‌లో విప్‌గా చిరుపదవి లభించింది. పేట రాధారెడ్డి ఛైర్మెన్‌గా ఉన్నపుడు వైస్ ఛైర్మెన్ పదవిని మరో సామాజిక వర్గానికి చెందిన ముత్యాల పార్థసారధికి అవకాశం దక్కింది. కానీ విజయకుమార్ నాయుడు కౌన్సిలర్‌గానే ఉన్నారు. 2019లో వైకాపా అధికారానికి వచ్చింది. తరువాత జరగాల్సిన ఎన్నికలు డీలిమిటేషన్ సమస్యతో మున్సిపల్ ఎన్నికలు జరగలేదు. వైకాపా పాలన ఐదేళ్ళలో పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలను నిర్వహించారు. అయితే విజయకుమార్‌నాయుడు ఎన్ని ఆటుపోటులు వచ్చినా పార్టీని వదలిపెట్టలేదు. 2024లో జరిగిన ఎన్నికల్లో పార్టీని విజయ పథంలో నడపటంలో ప్రస్తుత శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డికి వెన్నంటి ఉన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం తమ్ముళ్లకు ఏదో ఒక రకంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి నామినేటెడ్ పదవులతోనూ, లేక పార్టీ పదవులతో సంతృప్తి పరచారు. కానీ విజయకుమార్ నాయుడు మాత్రం పార్టీ అధ్యక్ష పదవికే పరిమితమై ఉన్నారు. అయితే పార్టీ కార్యక్రమాల్లో పట్టణంలో ఎంఎల్ఏ విజయకుమార్‌నాయుడుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీలో ఉన్న పదవుల్లో కొందరికి కేటాయించగా నామినేటెడ్ పదవుల్లో వారికి ఛాన్సు వచ్చింది. దాంతో కొందరు రెండు మూడు పదవుల్లో కొనసాగుతున్నారు. మరి ఆది నుంచి పార్టీని నమ్ముకొని అలాగే బొజ్జల కుటుంబాన్ని నమ్ముకున్న విజయకుమార్ నాయుడు మాత్రం పార్టీ పదవికే పరిమితమై ఉన్నారు. అయితే నాయకులను తనకు ఎందుకు పదవి ఇవ్వలేదని ప్రశ్నించలేదు. బొజ్జల కుటుంబ అనుయాయుడుగానే కొనసాగుతున్నారు.

# ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించండి

## - ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త:



నాయకులు, కార్యకర్తలు అనునిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొంటూ క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్ నందు 9వ క్లస్టర్ పరిధిలోని 5 డివిజన్లకు సంబంధించి ఇన్‌ఛార్జీలు, వివిధ కమిటీల సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. డివిజన్ స్థాయిలో ఇన్‌ఛార్జీలు, తెదేపా ప్రధాన అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు గురించి వివరించాలన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో ఇవ్వలేనంతగా రూ.4వేలు ఫించను ప్రతినెల 1వ తేదిన అందిస్తున్నామని, ఈ పంపిణీ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, నగరంలో జరుగుతున్న అభివృద్ధిపనులను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం డివిజన్ల వారిగా కమిటీ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన

పెద్దపంజాణి, మే19 ప్రభాతవార్త:



మండలపరిధిలోని కోగిలేరు గ్రామంలో మంగళవారం డా॥అగర్వాల్ కంటిఆసుపత్రివారి ఉచితవైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60మందికి వైద్యులు కంటిపరీక్షలను నిర్వహించారు. వీరిలో పలువురిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. కార్యక్రమంలో జిల్లాదళిత నాయకుడు సామాజిక కార్యకర్త చిన్నా, బాలరాజు, ఆసుపత్రి సిబ్బంది, రాఘవేంద్ర, వీరాంజనేయులు, వెంకటరెడ్డి, మణి, రాధ, యోగేష్ తదితరలు పాల్గొన్నారు.

## ఎంబీసీలు ఉచితవిద్యుత్ పథకాన్ని సద్వినియోగంచేసుకోవాలి.

-ఎంపీడీఓ బాలాజీ



పెద్దపంజాణి. మే 19 ప్రభాతవార్త:

మండలంలోఉన్న రజక, స్వర్ణకార, నాయిబ్రాహ్మనలతోపాటు అత్యంత వెనుకబడిన వర్గాలప్రజలు ప్రభుత్వం అందిస్తున్నఉచితవిద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాలాజీ కోరారు. రజకులు చాకలికులస్థులకు లాండ్రిఉంటే 150యూనిట్లవరకు ఉచితవిద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. అలాగే స్వర్ణకారులు విశ్వబ్రాహ్మణ వర్గాలకు దుకాణాలుఉంటే 100యూనిట్లవరకు ఉచితవిద్యుత్ ఉంటుందన్నారు. నాయి బ్రాహ్మణలకు సెలూన్ షాపులుఉంటే నెలకు 200యూనిట్లవరకు ఉచితవిద్యుత్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువున్న కుటుంబాలకు 100యూనిట్లదాకా ఉచితవిద్యుత్‌ను అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకాలను లబ్దిపొందాలనుకునేవారు తగుపత్రాలతో విద్యుత్ అధికారులను లేదా గ్రామసచివాలయాల్లో సంప్రదించాలని ఆయనకోరారు.

## గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

పుల్లంపేట, మే 19 ప్రభాతవార్త :



పుల్లంపేట మండలంలోని ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని డి ఇ శ్రీరాములు రెడ్డి అన్నారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదింటి కల గృహ నిర్మాణాలను, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నూతన గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియను చేపట్టాలని, గృహ నిర్మాణాల కొరకు గతంలో నిర్వహించిన సర్వేల ఆధారంగా గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి పంపించేలాగా ఉండాలన్నారు పుల్లంపేట మండలంలో ఇప్పటికే నిలిచిపోయిన వివిధ దశలో ఉన్న గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, కడ్డీలు అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు గ్రామ సచివాలయం సిబ్బంది, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పుల్లంపేట మండలాన్ని గృహ నిర్మాణంలో జిల్లాలో మొదటి స్థానం సాధించాలని అన్నారు సిమెంట్ గోడౌన్ లో సిమెంట్ ఎక్కువ కాలం ఉంచితే పాడు అవుతుందని పై అధికారుల సూచనల మేరకు నిలువ ఉన్న సిమెంటు కడ్డీలను గృహ లబ్ధిదారులకు అందజేయాలని ఆయన అన్నారు ఎంపీడీవో జయశ్రీ, ఏఇ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## పరామర్శే లేదు! పరిహారం ఎక్కడ?

రైల్వే కోడూరు,మే 19 ప్రభాతవార్త



పాతచిత్రం

గ్రామాలలో ప్రవేశించి వీధుల్లో ఆడుకుంటున్న పిల్లలు తిరిగే పెద్దలపై వన్యప్రాణులైన అడవి పందులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచి నాలుగు రోజులైనప్పటికీ ఇంతవరకు వారిని పరామర్శించాల్సిన ప్రభుత్వ అధికారుల జాడే కరువైంది. దీన్ని బట్టి చూస్తే రైల్వే కోడూర్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులైన రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులు విషయాన్ని తెలుసుకున్నారే గాని వారిని పరామర్శించేందుకు నిద్ర నుండి తేరుకోనట్లే తెలుస్తుంది. ఏదైనా కార్యక్రమాలు జరిగితే ఫోటోల ఫోజులకెళ్లే ప్రభుత్వ అధికారుల తీరు ప్రమాదాలకు గురవుతున్న ప్రజల పట్ల స్పందించడం కరువైంది. ఇటీవల గత నాలుగు రోజుల క్రితం జి.వి. పురం దళితవాడలో వీధుల్లో ఆడుకుంటున్న పిల్లలపై వన్యమృగాలైన అడవి పందులు ఊర్లలో కొచ్చి వారిపై దాడి చేసి పసి పిల్లలను తీవ్రంగా గాయపరిస్తే ఇప్పటికీ ప్రభుత్వ అధికారుల దృష్టికి వచ్చిన వాటి పట్ల స్పందించకపోవడం శోచనీయం. దీన్ని బట్టి చూస్తే దళితుల ప్రాణాల పట్ల అధికారులు తీరు తెన్నులు ఘోరంగానే ఉన్నట్లు తెలుస్తున్నాయి. దాడి జరిగిన రోజు అఖిలభారత అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పి. పెంచలయ్య జరిగిన తక్షణమే బాధ్యతాయుతమైన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. అయితే ఆదివారం ఉదయం జరిగిన దాడి సంఘటనలో గాయపడిన ఆ దళిత బిడ్డల పరామర్శకు తెలిసినప్పటికీ అధికారుల స్పందన కరువైంది.

## ఆశాజనకంగా టమోటా ధరలు

రామకుప్పం, మే 19 ప్రభాతవార్త



రైతులు సాగు చేస్తున్న టమోటా పంటకు గిట్టుబాటు ధరలు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో వర్షాలు కురవడంతో టమోటా పంట అక్కడ దెబ్బతినగా ఇక్కడ రేట్లు పెరిగాయి. రామకుప్పం, వి.కోట ప్రాంతంలో 15 కిలోల టమోటా బాక్సు 300-500రూ.ల ధర పలుకుతోంది. ధరలు ఉండడంతో రైతులు పంటలసాగుకు చేసిన అప్పులు తీర్చుకోవచ్చని భావిస్తున్నారు.

## రేపు కాణిపాకంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం

కాణిపాకం, మే 19 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవం చేయనున్నట్లు దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్‌లు తెలిపారు. ఈ మేరకు దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన వినాయక సదన్ వసతి సముదాయం-2, 3 అంతస్తుల భవనంను గురువారం ఉదయం 11 గంటలకు మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు, జిల్లాలోని పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొననున్నారని తెలిపారు.

## వరసిద్ధిడిని దర్శించుకున్న రాష్ట్ర ఉద్యానవన పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్

కాణిపాకం, మే 19 ప్రభాతవార్త:

రాష్ట్ర ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు కుటుంబ సమేతంగా మంగళవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రొటోకాల్ ఎఇఓ ధనపాల్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయాల్లో కూడా వారు పూజలు నిర్వహించారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరిటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలమీట్

పెనుమూరు, మే 19 ప్రభాతవార్త:

మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి, ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డిలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

## గణనాధుడిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, మే 19 ప్రభాతవార్త:



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన జడ్జికి ఆలయ సూపరిడెంటెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆయనతో వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటంను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలో పాము హల్‌చల్

పెద్దపంజాణి, మే 19 ప్రభాతవార్త:



స్థానిక గ్రామసచివాలయంలో మంగళవారం ఓ పాము ప్రవేశించి అక్కడపనిచేస్తున్న ఉద్యోగులను, సిబ్బందిని భయభ్రాంతు లకు గురిచేసింది. పామును చూసి తొలుత ఆందోళన చెందిన సిబ్బంది అనంతరం పామును కొట్టిచంపేశారు. ఇటీవలే సచివాలయంలో పై పెచ్చు లుఊడి సిబ్బంది గాయపడ్డారు. ఈ సంఘటన మరువకముందే సచివాయంలోకి పాము ప్రవేశించడంతో సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత సచివాలయం పూర్తిఅయినా ఇంతవరకూ ప్రారంభానికి నోచుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సి ఉంది.

# అగ్రకుల ఎమ్మెల్యేలను విడిచిపెట్టి దళిత ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తారా!

## - ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ రుసరుస

చిత్తూరు, మే 19 ప్రభాతవార్త:

జిల్లాలో అగ్రకుల ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇసుక, మట్టి భారీగా ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నది. ఈ నియోజకవర్గాల నుండి పత్రికల్లో ఒక్క వార్త వుండదు. అయితే దళిత ఎమ్మెల్యేగా గంగాధరనెల్లూరు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న తనపై మట్టి అక్రమ రవాణా అంటూ అనునిత్యం పత్రికల్లో వార్తలు వస్తున్నాయంటూ ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ఆక్రోశం వ్యక్తం చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ మాట్లాడుతూ చంద్రగిరి, నగరి నియోజకవర్గాల నుండి అనునిత్యం ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నదని, అయితే ఈ నియోజకవర్గాల నుండి పత్రికల్లో ఒక్క వార్త వుండదని, దళిత ఎమ్మెల్యే అయిన తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జిడినెల్లూరు నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియాపై అనునిత్యం వార్తలు రాసి తనను కొంతమంది విలేకరులు టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను డాక్టర్‌గా సేవ చేస్తున్నానని, తనకు కోటి రూపాయల వరకు ఆదాయం వస్తుందని, ఆ ఆదాయంను వదలి ప్రజా సేవ చేయాలని భావించి 15 నెలల పాటు క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రజల మన్ననలు పొంది ఎమ్మెల్యేగా గెలుపొందానని, అయితే తాను అవినీతి చేస్తున్నానంటూ తనను టార్గెట్ చేస్తూ పత్రికల్లో వార్తలు వస్తున్నాయన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణంలో జరుగుతున్న పలు గంగమ్మ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు. మంగళవారం 11వ వార్డు 3వ రైల్వేగేటు వద్ద ప్రతిష్టించిన గంగమ్మతల్లిని ఎమ్మెల్యే దర్శించుకొన్నారు. అనంతరం సాంబయ్యకండ్రిగలో జరుగుతున్న గంగమ్మజాతరలో పాల్గొన్నారు. కాగా స్థానికనాయకులు పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నాయకులతో కలసి గంగమ్మకు హారతి ఇచ్చి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా నాయకులు వసంత్‌కుమార్, రాజేష్‌కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం

కుప్పం, మే 19 ప్రభాతవార్త

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమాంబ జాతరలో చివరి ఘట్టంగా అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం జరుగుతుంది. బుధవారం ఉదయం అమ్మవారి శిరస్సు ఆలయంకు చేరుకున్న అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శన భాగ్యం భక్తులకు కల్పిస్తారు. వేల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి 11గంటల వరకు అమ్మవారి విశ్వరూప దర్శన కార్యక్రమం ఉంటుంది. అనంతరం అమ్మవారి జలవాసమేగే కార్యక్రమంతో జాతర ముగియనుంది.

## ఎన్‌సిసి విద్యార్థులకు ఫైరింగ్‌లో శిక్షణ

చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త:



గంగాధర నెల్లూరు పోలీసుల రెజిమెంట్ సెంటర్ నందు 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్‌వి మోనిష్, ఏఓ లోకనాధన్‌లు మంగళవారం ఎన్‌సిసి క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆయుధాల పరిచయం, ఫైరింగ్ స్థానాలు, లక్ష్యం చేధించడం, విద్యార్థులకు ఆయుధాల నిర్వహణ, గురి చూసి కాల్చడం, ఏకాగ్రతను ఎలా పెంపొందించుకోవాలి అనే అంశాలను సిబ్బంది వెత్రిరామన్, రమేష్, శివ విద్యార్థులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, యుగంధర్, హేమంత్, శ్రీలత, అరుణ్‌పాండియన్, ఆఫీసు సిబ్బంది సంజయ్‌భట్, ఎన్‌వి రెడ్డి, సాయి, సూపరింటెండెంట్ కవితా, బాలాజీ, ప్రతిమ, ఉమ, ఆఖిల్ తదితరులు పాల్గొన్నారు

## బాలింతలకు దుస్తులు పంపిణీ

చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త:



చిత్తూరు ప్రభుత్వఆసుపత్రిలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలకు మాస మహిళా దినోత్సవంను పురస్కరించుకొని శ్రీ సత్యసాయి సేవాసమితి సభ్యులు చిన్న పిల్లల దుస్తులు అందజేసినట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ఎస్ మధుసూదనం తెలిపారు. ఉదయం 10గంటలకు ధన్వంతరి వినాయకస్వామి ఆలయంలో మహిళా సేవాదళ్ సభ్యులచే పూజలు నిర్వహించి, ప్రసవించిన బాలింతలకు చిన్న పిల్లల దుస్తులు, నాప్కిన్స్, స్వామివారి విభూది ప్రసాదంలను బ్యాగ్‌లో వుంచి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో మహిళా సేవాదళ్‌సభ్యులు నిర్మల, రుక్మిణిలతో పాటు కన్వీనర్ జి ప్రభాకర్‌నాయుడు, సభ్యులు కృష్ణమనాయుడులు పాల్గొన్నారు.

## ఎల్‌ఐసిలో క్లాస్ 3,4 కేడర్ల రిక్రూట్‌మెంట్ చేపట్టాలి

కుప్పం, మే 19 ప్రభాతవార్త

ఎల్‌ఐసిలో క్లాస్3,4 కేడర్ల రిక్రూట్‌మెంట్ వెంటనే చేపట్టాలని ఎల్‌ఐసి ఫుట్‌టైమ్ టెంపరరీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎపి, కర్ణాటక, తెలంగాణా అధ్య క్షుడు సిఆర్ మోహన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. 1985-1991మధ్య పనిచేసిన తాత్కాలిక ఉద్యోగులను తొలగించడంతో వారు సుదీర్ఘ న్యాయపోరాటం చేసి 2015లో విజయం సాధించారన్నారు. సుప్రీ ంకోర్టు తీర్పు మేరకు 1985-1991మధ్య పనిచేసి తొలగించిన అర్హత గల కార్మికులు మరలా దరఖాస్తు చేసుకోవచ్చని 23-7-15న దేశ వ్యాప్తంగా వివిధ పత్రికల్లో 3.44కోట్లకు పైగా నిధులతో ప్రకటనలు ఇచ్చారన్నారు. మరలా ఎల్‌ఐసి వారు మనసు మార్చుకుని సంస్థపై ఆర్థికభారం పడుతుందని సుప్రీ ంకోర్టును ఆశ్రయించగా సుప్రీ ంకోర్టు యాభైశాతం బ్యాక్ వేజెస్‌తో ఇతర ప్రయోజనాలు చెల్లించాలని తీర్పు ఇచ్చిందన్నారు. గత పదేళ్లుగా వందలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 85శాతం మంది పదవీ విరమణ ప్రయోజనాలు ఆశిస్తున్నవారు ఉన్నారన్నారు. ఎల్‌ఐసి క్లాస్3,4లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని సిఎం చంద్రబాబునాయుడు ఈ సమస్యపై స్పందించి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, ఎల్‌ఐసి ఛైర్మన్‌తో మాట్లాడి అర్హులను తిరిగి ఉద్యోగంలో చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వీసును బట్టి యాభైవేల వంతున, ఇతర ప్రయోజనాలు ఇచ్చేందుకు అర్హులను ఎంపిక చేసే ందుకు 2022లో వేసిన చట్టబద్ధమైన కమిటీ ఇంతవరకు నివేదిక ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## మంచినీటి సమస్య పరిష్కారంకు చర్యలు



శాంతిపురం, మే 19 ప్రభాతవార్త

మండలంలోని సొన్నేగానిపల్లి పంచాయతీ రామాపురంలో తాగునీటి సమస్య పరిష్కారంకు పైపులైను ఏర్పాటుచేసి పరిష్కరిస్తామని ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ తెలిపారు. అలాగే గుండిశెట్టిపల్లి గ్రామంలో పైపులైను ఏర్పాటుతో శివాలయంకు నీరు అందిస్తామన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా ఐదు బోర్లలో నీరు రీచార్జ్ అయిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తితే బోర్ల ద్వారా అనుసంధానం చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్ నాయక్, నేతలు బాల సుబ్రమణ్యం, భాస్కర్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎస్వీయూలో ఐఐఎం స్టూడెంట్ అఫిలియేట్ చాప్టర్ ఘన ప్రారంభం

తిరుపతి విద్య, మే 18 ప్రభాత వార్త



తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్–హైదరాబాద్ స్టూడెంట్ అఫిలియేట్ చాప్టర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఎస్వీయూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ టాటా నరసింగరావు అధ్యక్షత వహించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ డైరెక్టర్, ఐఐఎం ప్రెసిడెంట్ బి . ఎస్ . మూర్తి స్టూడెంట్ అఫిలియేట్ చాప్టర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, భవిష్యత్ ఇంజనీరింగ్ సవాళ్లను ఎదుర్కోవడంలో మెటీరియల్స్ సైన్స్, సాంకేతిక ఆవిష్కరణల ప్రాధాన్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధన, శాస్త్రీయ వేదికలు, వృత్తిపరమైన సంఘాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ టాటా నరసింగరావు విద్యా సంస్థలు–పరిశ్రమల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌సీ ఛైర్మన్ డాక్టర్ కోమల్ కపూర్, మిధాని సీఎండీ డాక్టర్ ఎస్వీఎస్ నారాయణమూర్తి, బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈఓ డాక్టర్ జయతీర్థ ఆర్. జోషి, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సంబంధం మంజిని తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ చాప్టర్ ద్వారా విద్యార్థులకు సాంకేతిక ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, పరిశ్రమలతో పరస్పర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నీలం సంజీవరెడ్డికి ఎస్వీయూలో ఘన నివాళి

తిరుపతి విద్య మే 18 ప్రభాత వార్త



భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. దేశ రాజకీయ చరిత్రలో నీలం సంజీవరెడ్డి చేసిన సేవలను, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్రను స్మరించుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఉపకులపతి టాటా నరసింగ రావు ,కులసచివులు భూపతి నాయుడు పాల్గొన్నారు. బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ గుర్రంకొండ మాట్లాడుతూ, నీలం సంజీవరెడ్డి నిరాడంబర రాజకీయాలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ సాధారణ ప్రజల సమస్యలను అర్థం చేసుకుని సేవాభావంతో పనిచేసిన మహానేతగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. నేటి యువత నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యదర్శి నెల్లూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ,నీలం సంజీవరెడ్డి దేశ రాజకీయాల్లో విశిష్ట ముద్ర వేశారని తెలిపారు. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అనంతరం కోటగారం మురళి, గురు ప్రసాద్, ముత్తు వేలు, సిరిగిరి రమేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నీలం సంజీవరెడ్డి సేవలను కొనియాడారు.

## సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయం - ఆచార్య టాటా నరసింగరావు

తిరుపతి విద్య మే 18 ప్రభాత వార్త



భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ స్థాపన, అభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిదని ఉపకులపతి టాటా నరసింగ రావు పేర్కొన్నారు. మంగళవారం నీలం సంజీవరెడ్డి 113వ జయంతి సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి గజమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, రాయలసీమ వెనుకబాటుతనాన్ని ఎంతో ముందుగానే గుర్తించిన దూరదృష్టి గల నాయకుడు నీలం సంజీవరెడ్డి అని కొనియాడారు. సీమ ప్రజల విద్యా దాహాన్ని తీర్చేందుకు తిరుపతిలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కావడంలో ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని గుర్తు చేశారు. ప్రజాసేవ, నిజాయితీ, నిరాడంబరతకు ఆయన నిలువెత్తు నిదర్శనమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కులసచివులు భూపతి నాయుడు , కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, ఇతర ఆచార్యులు, ఇంజనీర్ తాండవకృష్ణ, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ గుర్రంకొండ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ముత్తు తదితర ఉద్యోగులు పాల్గొని నీలం సంజీవరెడ్డికి నివాళులర్పించారు.

విద్య 3

## అమ్మవారికి ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పూజలు



కుప్పం, మే 19 ప్రభాతవార్త

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ తల్లికి ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ శిరస్సు ఊరేగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా అమ్మవారికి గొర్రెలను కానుకగా సమర్పించారు. స్వయంగా ఆయన అమ్మవారి ఉత్సవాన్ని మోశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు భోజనాలను స్వయంగా వడ్డించారు.

## బస్సు ఢీకొని వ్యక్తి మృతి

### మృతుడు నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట వాసిగా గుర్తింపు

రైల్వేకోడూరు రూరల్, మే 19 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలంలోని మైసూర్‌వారిపల్లె పంచాయతీ పరిధిలోని ప్రైవేటు మామిడికాయల మండీల వద్ద గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కే రామచంద్రారెడ్డి (65) అక్కడికక్కడే మృతి చెందాడు. మామిడికాయల మండల వద్ద కూల్ డ్రింక్ షాప్ నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో రామచంద్రారెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఏఎస్ పేట వాసిగా పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, మే 19 ప్రభాతవార్త:



తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో సముద్ర చేపల వేట నిషేధ భృతి పథకం ప్రారంభించడం జరిగింది. కలెక్టరేట్ వీసీ హాలులో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి వారి ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వంపెద్దపీట వేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీసి హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల సేవలో సముద్ర చేపల వేట నిషేధ భృతి పథకం(2026-27) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ భృతిని సకాలంలో అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులతో కలసి లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి, ఇతర ఉన్నతాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సహాయకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం, మే 19 ప్రభాతవార్త:

ఐసీడీఎస్ ప్రాజెక్టు నగరి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకులభర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ నగరి ప్రాజెక్టు అధికారి ఇందిరా ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ సహాయకులకు 10వ తరగతి పాసై 21 సంవత్సరాల నుంచి 35 లోపు అదే గ్రామానికి చెందిన వివాహం అయిన మహిళలు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో 21 సంవత్సరాల లోపు అర్హులు లేనప్పుడు 18 సంవత్సరాలు నిండిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలను అవసరమైన ధృవపత్రాలను జతపరచి ఈ నెల 26వతేదీ లోపు నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఖాళీల వివరాలు ఇలా... నగరి మున్సిపాలిటీ పరిధిలో రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బీసీఏ కేటగిరికి చెందిన వారు కాగా నగరి రూరల్ మండలంలోని వీకేఆర్ పురం ఎస్టీ కాలనీలో ఎస్టీ కేటగిరి, కన్నికాపురం గ్రామంలో ఓసీ కేటగిరి, నింద్ర మండలపరిధిలో ఆరూరు ఎస్టీ కాలనీ, నెట్టేరి క్రాస్ రోడ్డులో ఎస్టీ కేటగిరికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే విజయపురం మండలంలో లక్ష్మి విలాసపురం హరిజనవాడలో ఎస్సీ 3 కేటగిరి, పాత మహారాజపురం హరిజనవాడలో, కేవీ శ్రీరామపురం గ్రామంలో ఓసీ కేటగిరి, సామిరెడ్డి కండ్రిగ గ్రామంలో ఓసీకి చెందిన వికలాంగులు అర్హులన్నారు.

## విజ్ఞాన సమృద్ధికి గ్రంధాలయాలు దోహదం

జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి

చంద్రగిరి, మే 19 ప్రభాతవార్త:



చిన్నారులు విజ్ఞానాన్ని సముపార్జించుకుని సమృద్ధి సాధించడంలో గ్రంధాలయాలు దోహదపడగలవని జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. స్థానిక గ్రంధాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేధోసంపత్తి, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లీష్ గ్రామర్, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి అంశాలలో పరిణతి సాధించడానికి ఈ శిబిరాలు చక్కగా ఉపయోగపడతాయన్నారు. మరింత మంది విద్యార్థులను శిబిరానికి తీసుకురావడానికి కృషి చేయాలని గ్రంధాలయ అధికారి రెడ్డెమ్మకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాయల్‌విక్టరీ స్కూల్ హెచ్‌ఎం సుమలత, తదితరులు పాల్గొన్నారు.

## మిట్టగంగమ్మ ఆలయ నిర్మాణానికి వితరణ

చంద్రగిరి, మే 19 ప్రభాతవార్త:



స్థానిక మిట్టగంగమ్మ ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న గర్భగుడి నిర్మాణానికి మంగళవారం దాతలు తమవంతు ఆర్థిక వితరణ గావించారు. చంద్రగిరికి చెందిన పెనుమూరు శివయ్య, కొండమ్మ దంపతులు, కుమారులు ఎన్.తేజ ప్రసాద్, ఎన్.గిరి ప్రసాద్ కుటుంబం రూ.1,00,000/-లు, అదేవిధంగా చంద్రగిరి కోట గ్రామానికి చెందిన ఆర్.ముని రూపేష్ ప్రేమలత, ఆర్.శశాంక్ దివంగత ఆర్.శ్రీదర్ జ్ఞాపకార్థం రూ.50,116/-లు ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డికి నగదు రూపంలో అందజేశారు. దాతలకు పూజారి సుబ్రమణ్యం అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొక్కల కార్తీక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిప్రత్తులతో నడివీధి గంగమ్మకు మరుపొంగళ్ళు

చంద్రగిరి, మే 19 ప్రభాతవార్త:



ఆరేపల్లి రంగంపేటలో మహిళలు భక్తి ప్రపత్తులతో నడివీధి గంగమ్మకు మంగళవారం మరుపొంగళ్ళు పెట్టుకుని మ్రొక్కులు తీర్చుకున్నారు. గత వారం అమ్మవారికి జాతర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్న గ్రామస్థులు మరుపొంగళ్ళు సమర్పిం చడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందులో భాగంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలతో పొంగళ్ళను మోసుకుని బ్యాండుభాజాలు, భాణాసంఛా పేళుళ్ల నడుమ పండుగ వాతావరణంలో ఆలయానికి చేరుకున్నారు. గ్రామస్థరాలు సుశీలమ్మ వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో అమ్మవారికి విశేష అలంకరణ గావించి ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్ళను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు.

## ఆశ వర్కర్లకు నిర్బంధ సబ్‌సెంటర్ డ్యూటీలను రద్దు చేయాలి

- సీఎఫ్‌టీయూ డిమాండ్

నాగలాపురం, మే 19 ప్రభాతవార్త:



ఆశ వర్కర్లకు నిర్బంధ సబ్ సెంటర్ డ్యూటీ రద్దు చేయాలని స్థానిక నాగలాపురం ధర్మరాజుల గుడి ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి శీల ఆశ వర్కర్ల యూనియన్ జి.గీత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు దేశాండి అరుణాచలం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ వర్కర్లు స్వచ్ఛందంగా సేవ చేస్తూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న బాలింతలకు పసి పిల్లలకు సామాన్య ప్రజల ఆరోగ్యాల కోంస నిరంతరం శ్రమిస్తూ ఉంటే ప్రభుత్వం వాళ్ళకు కనీస వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా సబ్ సెంటర్‌లో నిర్బంధంగా డ్యూటీలు చేయించడం వల్ల స్థానిక బాధితులకు అందుబాటులో లేకుండా పోయే అవకాశం ఉందని గర్భిణీలకు సకాలంలో ఆస్పత్రికి తీసుకుపోలేక ఇబ్బందులు పడుతున్నారని, పైగా సబ్‌సెంటర్ డ్యూటీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వేతనాలు ఇవ్వడం లేదని విమర్శలు చేశారు. అనంతరం స్థానిక ఆశ వర్కర్ల పీహెచ్‌సీలో ఐఎఫ్‌టీయూ కమిటీ సమావేశం జరిగిందని తెలియజేశారు. 12 మంది ఆశ వర్కర్లతో నూతన ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల ఆశ వర్కర్ల సమాఖ్య సమావేశం జరిగింది. కన్వీనర్‌గా జె.లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఇఫ్ట్ నాయకుడు దక్షిణమూర్తి, ఆశ, గీత, మునిలక్ష్మి, రూతు, లత, కిరుభ జయ, కోకిల, ధన, మీన తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

పుత్తూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంగళవారం ఉదయం భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణంకార్యక్రమం నిర్వహించారు. ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు అనంతరం మంగళ వాయిద్యాలు వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి విద్యుత్ దీపాలంకరణతో పురవీధుల్లో స్వామివారిని, అమ్మవారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఈ ఊరేగింపు కాపు వీధి, బజారు వీధుల్లో ఊరేగించి ఆలయానికి చేరుకుంది.

### నేడు ఆలయంలో...

శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలు కూడా ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని అనంతరం సాయంత్రం, యాలి వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి

పుత్తూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:

పుచ్చలపల్లి సుందరయ్య స్వాతంత్ర్య సమరయోథులు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆటో స్టాండ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, సుబ్రహ్మణ్యంపిళ్లె, శివ, ధన, కుమార్, గోవిందస్వామి, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లికి అంబళ్లు సమర్పణ

పుత్తూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని తొరూరు గ్రామంలో గ్రామదేవత గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఉదయం గంగమ్మ మండపం వద్ద గ్రామస్తులు ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి అంబళ్ల నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రిపైన గంగమ్మను బంకమట్టితో తయారు చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో డప్పు వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణతో వేపాకు తోరణాలతోసుందరంగా అలంకరించారు.

## మహిళల రక్షణకే గృహ హింస నిరోధక చట్టం

సత్యవేడు, మే 19 ప్రభాతవార్త:



మహిళల రక్షణ కోసమే గృహ హింస నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందని తిరుపతి జిల్లా సత్యవేడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కోటమిట్ట అంగన్‌వాడీకేంద్రంలో కిషోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ 2005 నుంచి గృహహింస నిరోధక చట్టం అమలు జరుగుతున్నట్లు చెప్పారు. దీని ద్వారా మహిళలకు న్యాయపరమైన రక్షణ, ఉపశమనం లభిస్తాయన్నారు. భాగస్వామ్య కుటుంబంలో నివసించే స్త్రీని శారీరకంగా మానసికంగా, లైంగికంగా ఆర్థికంగా వేధించడం గృహ హింస కిందకు వస్తుందని ఆమె వివరించారు. దీంతో పాటు అదనపు కట్నం కోసం ఆస్తి కోసం వేధించడం, వాహనంతో రక్త సంబంధంతో, లేదంటే ఒకే ఇంట్లో కలసి జీవిస్తూ భాగస్వామ్య కుటుంబంగా ఉన్న మహిళలందరికి ఈ చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. వేధింపుల కారణంగా మహిళను ఇంటి నుంచి గెంటేయడానికి వీల్లేదని ఆమె స్పష్టం చేశారు. పైగా ఇంట్లో ఉండేందుకు ఆమె కోసం ప్రత్యేకంగా మరొక ఇల్లు ఏర్పాటు చేసేలా కోర్టు ఆదేశించవచ్చన్నారు. వైద్య ఖర్చులు రోజువారి అవసరాల కోసం భర్త, వ్యతిరేక పక్షం నుంచి ఆర్థిక సహాయం అందే అవకాశాలు ఉందన్నారు. నిర్బంధ విద్య హక్కు చట్టంపై వివరించి దీనిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిషోర బాల బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంజీవన్న...హుందాగా రాజకీయం చేయండి: ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, మే 19 ప్రభాతవార్త: రాజకీయాల్లో సీనియర్ అయిన మీరు హుందాగా రాజకీయాలు చేస్తే బాగుంటుందని కేవలం వ్యక్తిగత విమర్శలు చేస్తూ ఉనికిని చాటుకోవాలని చూడడం మంచి పద్ధతి కాదని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వయస్సు రిత్యా మీరు ఆవేశంగా మాట్లాడవద్దని, మిమ్మల్ని చూస్తుంటే మీ ఆరోగ్యాన్ని చూసి నాకు భయం వేస్తుందని తెలిపారు. మీరు మరో 10 సంవత్సరాలు రెస్ట్ తీసుకోండని లేనిపోని ఆశలు పెట్టుకొని హడావిడి చేయ వద్దంటూ నెలవల విజయశ్రీ హితవు పలికారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాలు అవుతుందని ఈ కాలంలో ఎటువంటి వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా రాజకీయం చేస్తున్నానని ఆమె చెప్పారు. మా కుటుంబం మీద వ్యక్తిగతంగా విమర్శల దాడి చేస్తూన్న మీరు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తే వాటిని పరిశీలించి అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో పోటీ పడండి అంతేగాని లేనిపోని విమర్శలు చేసి పబ్బం గడుపుకోవాలని చూడడం మంచిది కాదన్నారు. రెండేళ్ల తన హయాంలో అభివృద్ధిపై, అలాగే ఎమ్మెల్యేగా సంజీవయ్య పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ వేదికపై చర్చకు సిద్ధమని ఆమె వెల్లడించారు. ఎవరి మీద వ్యక్తిగతంగా కక్షలతో అక్రమ కేసులను పెడుతున్నామని ఆరోపిస్తున్నారని అది సమంజసం కాదన్నారు. పెళ్ళకూరులో కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి దౌర్జన్య కాండకు చరమగీతం పాడేందుకే గతంలో చేసిన తప్పులకు ఆయనపై కేసులు పెట్టారని అంతేగాని ఈ విషయంలో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. శెట్టిపల్లి గ్రామంలో భూముల విషయంలో పార్టీలకు అతీతంగా పనిచేయడంతో అక్కడి వైసీపీకి చెందిన నాయకులే తమ పార్టీని అభినందించారని ఆమె గుర్తు చేశారు. పెట్రోల్ ధరల పెంపు విషయంలో వైసిపి ఆధ్వర్యంలో చేస్తున్న ఆందోళనలు అర్థరహిత మన్నారు. గతంలో పక్క రాష్ట్రంలో లీటర్ పెట్రోల్‌కు ఆరు రూపాయలకు పైగా తక్కువగా ఉండేదని ఆమె గుర్తు చేశారు. అంతర్జాతీయంగా పెట్రోల్ ఉత్పత్తుల సమస్య తీవ్రంగా ఉంటే కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ సమస్య ఉన్నట్లు బూచిగా చూసేందుకు వైసిపి నాయకులు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. రేషన్ మాఫియా, అక్రమ ఇసుక త్రవ్వకాలతో తమ కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని ఆమె పేర్కొన్నారు. ఏఎంసి చైర్మన్ ఆకుతో రమేష్ మాట్లాడు తూ పెట్రోల్ ధర రెండు విషయాన్ని రాజకీయం చేయడం శోచనీయం అన్నారు ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ కుటుంబ సభ్యులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సబబు కాదని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యావంతుడైన సంజీవయ్యపెట్రోల్ ధర పెంపు విషయంలో మాట్లాడిన మాటలు ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్య చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. 786 రఫీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన అవినీతికి అంతు లేదని నాయుడుపేట సూళ్లూరుపేట మున్సిపాలిటీలలో అస్సలు అభివృద్ధి పనులే చేయలేదని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు బొమ్మన పళని, చైతన్య కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, కట్టారమణారెడ్డి, పాడి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార రథాన్ని పచ్చ జెండాతో ప్రారంభించిన డీఈవో



వాకాడు, మే 19 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు గ్రామంలోని మంగళవారం బడి పిలుస్తోంది ప్రచార రథాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 22వ రోజు బడి పిలుస్తుంది కార్యక్రమంలోని భాగంగా ఎస్ఏఎల్సి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలోని ఏర్పాటు చేసిన సభలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్‌కు ఘన స్వాగతం పలికి ఎంఈఓలు విజయ్ కుమార్, నసీం అలీ, ప్రవీణ్ కుమార్, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువా కప్పి పూలమాలలు చేసి ఘన సత్కారం చేశారు, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన పదవ తరగతి మెరిట్ విద్యార్థిని విద్యార్థులకు డిఇఒ కెవిఎన్ కుమార్ చేత బహుమతులను అందజేశారు, అనంతరం ఎస్ఏఎల్సి ప్రభుత్వ పాఠశాల నుండి ప్రసార రథంతో ర్యాలీగా అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో డీఈఓతో పాటు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మానవహారం నిర్వహించారు. మండలంలోని జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల నుండి సుమారు 15 మంది విద్యార్థిని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఎంఈఓలు, ప్రధానో పాధ్యాయులు పనితీరును ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బడి పిలుస్తుంది కార్యక్రమంలో ఎంపీడీవో సాయి ప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రామలింగారెడ్డి, దినకర్ బాబు, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని బాలిరెడ్డిపాలెం, తిరుమూరు, దుగ్గరాజుపట్నం, తూపిలి పాలెం, వాలమేడు, మూల పడవ, శ్రీపురం, గ్రామాలలో బడి పిలుస్తుంది ప్రచార రథం పర్యటించింది.

## గాఢాంధకారంలో పెళ్ళకూరు రహదారి



పెళ్లకూరు, మే 19 ప్రభాతవార్త: మండల కేంద్రమైన పెళ్ళకూరుకు రాత్రి వేళలో వెళ్లాలంటే ప్రయాణికులు, ప్రజలు భయపడుతున్నారు. రాత్రివేళ 6:00 గంటలు అయిందంటే ప్రజలు ఈ దారిని వెళ్లాలంటే గజగజ వణుకుతూ భయం గుప్పెట్లో బతుకుతున్నారు. ఈ రహదారి జాతీయ రహదారి నుండి పెళ్లకూరు గ్రామంకు సుమారు ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది. ఈ దారి పొలాల మధ్య కుండా వెళ్లాడంతో రాత్రి అయ్యిందంటే పాములు భయం అంతేకాకుండా కంపెనీలకు వెళ్లే మహిళలు రాత్రి డ్యూటీ చేసుకొని ఇంటికి రావాలంటే గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని రావాల్సిందే. ఈ దారిలో విద్యుత్ స్తంభాలు ఉన్న కొంతవరకే ఉన్నాయి. ఆ ఉన్న స్తంభాల్లో కూడా విద్యుత్ బల్బులు వెలగవు. ఎప్పుడో పండగలప్పుడు తూ తూ మంత్రంగా నాలుగు బల్బులు వేసి మా పని అయిపోయింది. అన్నట్టుగా వ్యవహరిస్తారు. గత ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్న ఎవరూ పట్టించుకున్న పాపాలు పోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చీకటిగా ఉన్న రోడ్డును వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హత్య రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, మే 19 ప్రభాతవార్త: హత్య రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా వైసిపి పార్టీ మారిందని గతంలో వారు చేసిన హత్య రాజకీయాలే ఇందుకు నిదర్శనమని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం పట్టణంలోని సూళ్లూరు నాగరాజపురం దళితవాడలో వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఉన్న అనంతబాబు తన డ్రైవర్ దళితు డైన సుబ్రహ్మణ్యం సుభార్యతో కలిసి హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్నారు. హత్య చేసిన విషయం నిరూపణ అయినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఈ కేసు విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కేసు విషయంలో ఎమ్మెల్సీ అనంత బాబు ను అరెస్టు చేసి నట్లు తెలిపారు. అలాగే జగన్మోహన్ రెడ్డికి స్వయాన చిన్నాయన వైయస్ వివేకానంద రెడ్డిని హత్య చేసి గుండెపోటు అని ప్రచారం చేసిన ఘనత వైసిపి పార్టీ నేతలకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్ఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, మేడ సాయి నారాయణ, వెంకీ యాదవ్, అలీ భాయ్, కొండలరావు, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన వేనాటి సతీష్ రెడ్డి



సూళ్లూరుపేట, మే 19 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వేనాటి సతీష్ రెడ్డికి హామీ ఇచ్చారు.

## గ్రంథాలయంలో...సరదా గణితం

సూళ్లూరుపేట, మే 19 ప్రభాతవార్త: విద్యార్థులలో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి, సంఖ్యలపై ఆసక్తిని కలిగించేందుకు స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులలో భాగంగా గణిత ఆటలు, తార్కిక నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎన్. శ్రీనివాసులు ఆధ్వర్యంలో మ్యాజిక్ స్క్వేర్స్, సంఖ్యా పజిల్స్ ద్వారా కూడికలు, తీసివేతలపై విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా ఆటలు నిర్వహించారు. అనంతరం వేద గణిత చిట్కాలు క్యాలిక్యులేటర్లతో పనిలేకుండా, పెద్ద పెద్ద గుణకారాలు మరియు భాగహారాలను కేవలం మనసులోనే లెక్కించి, సెకన్ల వ్యవధిలో సమాధానం చెప్పే స్పీడ్ మ్యాథ్స్ మెళకువలను విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బి.డి.సి.యల్ వంకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో పుచ్చలపల్లి వర్ధంతి



సూళ్లూరుపేట, మే 19 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని ఆర్టీసీ స్టాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు మంగళవారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ, చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ చలివేంద్రాన్ని మాజీ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ద బత్తిన వెంకటరమణ ప్రారంభించి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్, సూళ్లూరుపేట సిఐటియు ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తితో వేషాలతో గంగమ్మకు మొక్కులు...మరుపొంగళ్ళు





తిరుపతి,మే 19ప్రభాతవార్త:: తిరుపతి నగర ప్రజల ఆరాధ్య దైవమైన తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో తొలిమంగళవారం గంగమ్మ జాతర మరు పొంగళ్ళు భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు మరుపొంగళ్ళు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్న నేపథ్యంలో తొలి మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ పురుషుల వేషధారణలతో భక్తి పరవశంగా ఊరేగింపులో పాల్గొన్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక ప్రదర్శన గంగమ్మ ఆలయం వరకు సాగి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ పాలకమండలి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గంగమ్మ జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు మరు పొంగళ్ళు నిర్వహిస్తూ, కళాకారులు సంప్రదాయ వేషధారణలతో అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగు తోందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో, పంటలు పుష్కలంగా పండుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలోరాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కెఎన్ రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, రంగస్థలి నటులు చంద్రబాబు నాయుడు, సిద్ధవరం వెంకటాద్రి,తిరుపాల్ ఆచారి ,భాస్కరాచారి, ముని, విజయసింహారెడ్డి, కారణాటం మురళి, వాసు, వెంకటరత్నం, చంగల్ రాయులు, నగర సంకీర్తన మండలి సభ్యులు పద్మావతి, మునినాథరెడ్డి, శ్రావణి, జయమ్మ, విగ్రహాల కళ్యాణి, సిద్ధమ్మ, వాసుదేవ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, మునేంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి, కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



తడ, మే 19 ప్రభాతవార్త : మహిళలు అన్ని రంగాలలో నైపుణ్యం కలిగి ఉండాలని మహిళలకు కల్పించిన హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీ మనారాయ ణమ్మ మహిళలకు అవగాహన కల్పించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోడి లింగాల పాడు అంగన్వాడి కేంద్ర నందు 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు కిశోరి బాలికలు నైపుణ్యం, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రభుత్వం మహిళల రక్షణకు కల్పిస్తున్న చట్టాలను వివరించారు...

## బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



తడ, మే 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి ఉత్తీర్ణతలోని ముందడుగు సాధించింది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఎక్కువ శాతం చేర్పించే విధంగా బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జూన్ 1వ తేదీన మండల పరిధిలో బడి పిలుస్తోంది కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యాశాఖ అధికారులు వేములు మల్లికార్జునరావు మండల పరిధిలోని ప్రధానోపాధ్యా యులతో సమావేశం అయ్యారు బడికి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## సుబ్రమణ్యేశ్వరునికి విశేష పూజలు



పెనుమూరు, మే 19 ప్రభాతవార్త: జేష్ఠ మాస తదియ మంగళవారం పురస్కరించుకుని స్థానిక కన్నికల కొండపై వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు తారకరామశర్మ, అర్చకులు శివరామశర్మ వేద మంత్రోచ్చారణతో స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దీనికి ఉభయదారులుగా పెనుమూరుకు చెందిన జగన్నాథం, రేఖ దంపతులు, తిరిగిరెడ్డిపల్లికి చెందిన తిరుమలేష్, శ్రావణిలు, పాకాల మండలం వడ్డేపల్లికి చెందిన గిరిబాబు, కృష్ణవేణిలు, శ్రీకాళహస్తికి చెందిన వెంకటలక్ష్మి, ఆమె కుమారుడు హరీష్‌లు వ్యవహరించారు.

## ప్రజా సమస్యలపై లోతైన దృష్టి పెట్టండి

**- మంచి పాలనకు కట్టుబడి పనిచేయాలి -డాక్టర్ కోడూరుకు నారా లోకేష్ సూచన**

తిరుపతి,మే 19ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకుదనం, లోతైన అవగాహనతో ముందుకు సాగాలని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యంకు సూచించారు. ప్రత్యేకంగా, ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో లోతుగా అధ్యయనం చేసి, వేగవంతమైన పరిష్కారాల ద్వారా మంచి పాలన అందించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని నిర్దేశం చేశారు. మంగళవారం ఉదయం ఉండవల్లిలోని నివాసగృహంలో మంత్రి నారా లోకేశ్‌ను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొడూరు బాల సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రాంతంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి అంశాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన

# సూళ్ళూరుపేట డివిజన్

## కార్పొరేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



వాకాడు, మే 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విద్యకే పెద్దపీట వేస్తుందని, ఆ క్రమంలోనే ప్రైవేట పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరిట్ తీసుకురావడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం 22వ రోజు బడి పిలుస్తుంది కార్యక్రమంలోని భాగంగా మండల కేంద్రమైన వాకాడులో ఎంఈఓలు విజయకుమార్, నసీం అలీ, ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ప్రచార రథం కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో మానవహారంలో డీఈవో కేవిఎన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కిట్ నందు యూనిఫామ్ బూట్లు పాఠ్య పుస్తకాలు విశాలమైన తరగతి గదులు ప్రతి తరగతి నందు ఐఎఫ్పి ప్యానెల్ ద్వారా విద్యను అందిస్తున్నారని అన్నారు, కార్పొరేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా కే అధిక ప్రాధాన్యత ను ఉపాధ్యాయులు కల్పించాలన్నారు, విద్యకే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక ప్రణాళికలు తీసుకొని రానున్నందని అని అన్నారు.

## టిడిపితోనే దళితుల అభివృద్ధి

**- టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుజగేంద్రరావు**



వాకాడు, మే 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో టిడిపితోనే దళితులు అభివృద్ధి చెందారని టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇంగిలాల బుజగేంద్ర రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వాకాడు ఇరిగేషన్ అతిథి గృహంలో తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ఎస్సీ సెల్ విభాగానికి చెందిన సమస్యలపై స్థానిక విలేకరులతో బుజిగేంద్ర రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం వైసిపి నేతలకు బలైన రోజని ఈ సందర్భంగా గుర్తు చేయడం జరుగుతుందన్నారు. గత వైసిపి పాలనలో టిడిపి కార్యకర్తలను, దళితులను, భయంతో, కేసులతో దాడులు చేసేదని వైసీపీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డ నుంచి రెండు సంవత్సరాలు జరుగుతున్న వైసిపి దళితుల కార్యకర్తలు గాని, నాయకులను గాని టిడిపి ప్రభుత్వం కేసులు పెట్టిన సందర్భాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తీపలపూడి రమణయ్య, మండల యువత పంత్రంగం అరుణ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న పేర్నేటి



వాకాడు, మే 19 ప్రభాతవార్త: వాకాడు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలోని వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం లోని మంగళవారం రాష్ట్ర వైఎస్ఆర్సిపి సిఇసి సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు పేర్నటి శ్యాంప్రసాద్‌రెడ్డి పట్టు వస్త్రాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజారి పేర్నేటి కుటుంబానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కటాక్షం వలన ప్రతి ఒక్కరికి మంచి జరగాలని కోరుకుంటున్నాను అన్నారు. శ్యాం ప్రసాద్‌రెడ్డి వెంట వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు ఉన్నారు.

## మహాలక్ష్మి బ్రహ్మోత్సవ వేడుకల్లో పలువురు నేతలు



వాకాడు, మే 19 ప్రభాతవార్త : వాకాడు గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలోని వెలసిన శ్రీశ్రీశ్రీ చతుర్భుజా మహాలక్ష్మి అమ్మవారు బ్రహ్మోత్సవ వేడుకలు ఆలయ ధర్మకర్త పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో జరిగే అభిషేకాలు, విశేష పూజలు, హోమాలు, కుంకుమ పూజ, తదితర పూజా కార్యక్రమాల్లో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్‌తో పాటు టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, నంద గోపాల్ రెడ్డి, చంద్ర భూషణ్ రెడ్డి, అలాగే వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్ రెడ్డి, ఎర్రటపల్లి మధుసూదన్‌రెడ్డి, కోట వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు, స్థానిక నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. మహాలక్ష్మి బ్రహ్మోత్సవ వేడుకల్లో సందడి సినీ తారలతో చేయడం అభినందనీయమన్నారు.

## పేదల కోసం జీవితం అంకితం చేసిన పుచ్చలపల్లి




వెంకటగిరి, మే 19 ప్రభాతవార్త: పేదలు కార్మికుల కోసం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని అంకితం చేశారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య తెలిపారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ మహానేత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె. మస్తానయ్య సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు వి.రవిచంద్ర మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాన్ని పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం అంకితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రసాద్, పోలయ్య, శిరీష, ప్రకాష్, మహిళా సంఘం నాయకులు రత్నమ్మ, ధనలక్ష్మి, గౌరమ్మ, గంగమ్మ, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## బెటాలియన్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

**- కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్**



వెంకటగిరి, మే 19 ప్రభాతవార్త: బెటాలియన్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యమని ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఈఎస్ ప్రసాద్ తెలిపారు. 9వ ప్రత్యేక పోలీస్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమై ఉన్న సిబ్బంది సంక్షేమం కొరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కంటి ఇతర పరీక్షలను నిర్వహించారు. తిరుపతిలోని మేడిగో, హరికృష్ణ నేత్రాలయ డాక్టర్స్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్స్ కె.నవీన్, తేజేశ్వరి, హరిణి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పతకం సాధించిన అక్షయ



బాలాయపల్లి, మే 19 ప్రభాతవార్త: పట్టణానికి చెందిన వైసిపి సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్, పెంచలకోన దేవస్థానం మాజీ సభ్యుడు ఢిల్లీ బాబు, అరుణ కుమార్తె డాక్టర్ అక్షయ బంగారు పతకం సాధించారు. తమిళనాడులోని పాండిచ్చేరిలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. మాస్టర్ ఆఫ్ సర్జన్ కోర్సును కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌లోని శ్రీదేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హెయిర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కేంద్రంలో (జ్యాలప్ప మెడికల్ కళాశాల) పూర్తి చేశారు. బంగారు పతకం సాధించిన విద్యార్థిని పట్టణంలోని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

## భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి




తడ,మే 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించి రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తడ తహసిల్దార్ రవికుమార్ రైతులకు తెలియ జేశారు. మంగళవారం మండల పరిధిలోని వెండ్లూరుపాడు గ్రామంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ మండల పరిధిలో వివిధ గ్రామాలు భూముల రీసర్వే పూర్తి అయినదని అందులో భాగంగా వెండ్లూరుపాడు గ్రామంలో రీసర్వే మొదలవుతుందని రైతులకు ప్రభుత్వం కల్పించిన గొప్ప అవకాశం అని అన్నారు. అనంతరం రీ సర్వేపై గ్రామంలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బడి ఈడు దివ్యాంగుల పిల్లలంతా బడిలోనే ఉండాలి



పాకాల, మే 19, ప్రభాతవార్త:

బడి ఈడు కలిగిన ప్రతి దివ్యాంగ విద్యార్థి కూడా ఖచ్చితంగా బడిలోనే ఉండాలని, వారికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పాకాల మండలంలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల పిల్లల ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల మే 4వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు బడి ఈడు దివ్యాంగుల పిల్లల నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో

## తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి

భాగంగా మంగళవారం మండల పరిధిలోని శ్రీనివాసపురం, ముద్దులపల్లి, గోర్పాడు, పాలినేనివారిపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించి పిల్లల వివరాలను సేకరించినట్లు పేర్కొన్నారు. సర్వేలో గుర్తించిన దివ్యాంగ పిల్లల వివరాలను ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. ఏ ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు, ఉచిత విద్యా సామగ్రి, థెరపీ సేవలు, అవసరమైన సహాయక పరికరాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి సమీప పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి పాఠశాలలో దివ్యాంగులకు అనుకూల వాతావరణం కల్పించడం, ర్యాంపులు, ప్రత్యేక మరుగుదొడ్లు, అవసరమైన విద్యా వనరులు అందుబాటులో ఉండేలా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి సమగ్ర శిక్ష శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దివ్యాంగ పిల్లల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు మునికృష్ణ రెడ్డి, సుందరి, గ్రామస్థులు, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ల ఐక్యతను దెబ్బతీసేలా కుట్ర చేయడం దారుణం

## - నరసింహ యాదవ్



తిరుపతి హెల్త్, మే 19, ప్రభాతవార్త

తిరుమల శ్రీవారి సన్నిధిని మాత్రమే నమ్ముకుని దశాబ్దాల కాలంగా భక్తుల సేవలకు అవసరమైన నిర్మాణ పనులను చేసుకుంటున్నామని, కాంట్రాక్టర్ల ఐక్యతను దెబ్బతీసే కుట్రను కొంతమంది చేయడం దారుణమని శ్రీ వెంకటేశ్వర టిటిడి కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.వి.నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సభ్యులతో కలిసి నరసింహ యాదవ్ మాట్లాడారు. ఇటీవల ఓ దినపత్రికలో యూనియన్ గురించి నిందారోపణలు చేశారని, ఎక్కడ గాని మా ఐక్యతకు భంగం కలగకుండా, యూనియన్ బలోపేతం చేయడం, కార్యకలాపాల కోసం, సభ్యుల సంక్షేమ నిధి కోసం మాత్రమే ఈ సభ్యత్వ రుసుము వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా తిరుమల శ్రీవారిని నమ్ముకుని సేవ చేస్తున్న తమపై ఇటువంటి ఆరోపణలు బాధ కలిగించాయన్నారు. 40 మంది కాంట్రాక్టర్లుగా గడిచిన దశాబ్దాల కాలంగా తిరుమల శ్రీవారి సన్నిధిలో చిన్నపాటి కాంట్రాక్టులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఎవరో ఒకరు లేనిపోని ఆరోపణ చేయడంతో, ఆ చేసిన వ్యక్తి కూడా అసోసియేషన్ నిర్వహణ ఎంత కష్టమో తెలుసుకొని ప్రవర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అసోసియేషన్ కార్యకలాపాల కోసం ఒక ప్రైవేటు ఇంటిని అద్దెకు తీసుకొని ప్రతినెల అద్దె చెల్లిస్తూ, సభ్యుల సంక్షేమానికి పారదర్శకంగా కృషి చేస్తున్నామన్నారు. అసోసియేషన్ కు సభ్యత్వం రూపంలో వచ్చే ప్రతి రూపాయి అసోసియేషన్ ఖాతాకు చేరుతుందని, ఖర్చు చేసే ప్రతి రూపాయి జవాబు దారితనంగా ఉంటుందన్నారు. తిరుమల శ్రీవారిని నమ్ముకున్న తమను అప్రతిష్ట పాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వర్ రెడ్డి, జొన్న వెంకటేశ్వర్లు, మునికృష్ణ, వసంత దీపక్, ప్రభాకర్, రమణారెడ్డి, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విలువలు లేని కుటుంబం భూమనది!

## రాగల ఆనంద గౌడ్



తిరుపతి, మే 19ప్రభాతవార్త:

ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో నిత్యం అలజడులు, అశాంతి.. సృష్టించడమే భూమన అభినయ్ కు నిత్య కృత్యమైందని, అశాంఘిక శక్తులను ప్రోత్సహిస్తూ గంజాయి అమ్మించే స్థాయికి దిగజారిన భూమన కుటుంబానికి ఏ విలువలు లేవని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్ విమర్శించారు. నిత్యం నీతులు.. ప్రవచనాలు.. చెప్పే తండ్రీ కొడుకులు గత చరిత్ర మొత్తం చాలా హీనమైరదన్నారు. తిరుపతి మున్సిపల్ ఎన్నికల్లో, కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో, పార్లమెంటు ఉప ఎన్నికల్లో వాళ్ళు చేసిన అరాచకాలను తిరుపతి ప్రజలు ఇప్పటికి మర్చిపోలేదన్నారు. అభినయ రెడ్డి ఏనాడు జనం నుండి గెలిచిన వ్యక్తి కాదని.అతనికి ప్రజా ఆమోదం లేదని. అలాంటి వ్యక్తి తిరుపతిని ఉద్ధరిస్తున్నట్టుగా తనను తాను గొప్పగా ఊహించుకుంటూ భ్రమల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి ఆయన కొడుకు అభినయ రెడ్డిలు నిజం తెలుసుకొని మాట్లాడాలన్నారు.

# ఒక్క భారత్ గ్యాస్‌కి కోటి కష్టాలు

## న బుకింగ్ కి....నైనై బ్లాక్‌లో...రైరై



సత్యవేడు, మే 19 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం భారత్ గ్యాస్‌కి తీరని కష్టాలు వచ్చాయని లబ్ధిదారుల లబోదిబోమంటున్నారు. మంగళవారం ఉదయం నుంచి భారతి గ్యాస్ గోడౌన్ కార్యాలయంలో మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో వారు ఒక్క గ్యాస్ కొరకు గంటల తరబడి వేచి ఉన్నా బుకింగ్ ఈ రోజు లేదు రేపు అంటూ మొహం చాటేస్తున్నారు. బ్లాక్‌లో భారత్ గ్యాస్ విచ్చలవిడిగా చలామణి అవుతుండడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రేటు ప్రకారం బుకింగ్‌కు రూ.947లుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వారికి గ్యాస్ లేదని చెప్పేయడంతో చేసేది ఏమీలేక ఇంటి ముఖం పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే భారత్ గ్యాస్ బ్లాక్‌లో 1500 రూపాయలు నుంచి ఒక్కొక్కరికి వారి డిమాండ్ బట్టి 1800 రూపాయలు వరకు బిల్లు చేస్తున్నట్లు బహిరంగ పేర్కొంటున్నారు. ఏకంగా సత్యవేడు పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటల్లో, టీ దుకాణాల వారికి అయితే 2 వేలు చొప్పున భారీగా నగదు దోపిడీ చేస్తూ ఉండడం గమనార్హం. భారత్ గ్యాస్ గోడౌన్, కార్యాలయం వద్ద ప్రశ్నించినా వారికి మొన్న విజిలెన్స్ వారు వచ్చారు. లక్షలు జరిమానా వేశారు. మేము ఎవరికి చెప్పుకోవాలి అంటూ కార్యాలయంలోని కొందరు బహిరంగంగానే లబ్ధిదారుల వద్ద పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత్ గ్యాస్ బ్లాక్‌లో అయితే విచ్చలవిడిగా దొరుకుతుందని అందరూ ఆవేదనతో గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు గ్యాస్ కష్టాన్ని తీర్చాల్సిందిగా పలువురు ప్రాదేయ పడుతున్నారు.

# ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం

## అన్నదానాలు



తొట్టంబేడు మే 19 ప్రభాతవార్త

నిత్యం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలనసాగిస్తూ అధికారులకు ప్రజలకు వారధిగా ఉందామని డామ.ధన శేఖర్ జన్మదిన సందర్భంగా వివరించారు. తొట్టంబేడు మండల కార్యాలయ సమీపంలోని ప్రకృతి వనరుల మధ్య ఏర్పాటు చేసారు. తొట్టంబేడు మండల నాయకులు ఆయనకు దుశ్శాలువలతో సన్మానం చేసి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని పాత బలరాం థియేటర్ ఎదురుగా ఉన్న శరవణ నెట్ సెంటర్లో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఎవరికి ఏ సమస్యలున్న తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గంధం. ముని చంద్ర, కాకి.హరిబాబు, షేక్ బాబ్జాన్, లింగమ నాయుడు పల్లి ప్రాంతానికి చెందినచంద్ర, వెంకటేష్,రమేష్, మునిశేఖర్, శరవణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేటితో ముగియనున్న ఈఏపీసెట్ అగ్రి, ఫార్మసీ పరీక్షలు

తిరుపతి విద్య, మే 18 ప్రభాతవార్త

తిరుపతి నగరంలో నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్,ఫార్మసీ ప్రవేశ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఐదు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలి రోజు సుమారు 2 వేల మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, అందులో 88 శాతం మంది పరీక్ష రాశారు.పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బుధవారంతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. చివరి రోజు మరో 2 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

## జలధార పనులు బాధ్యత ఇంజనీర్లదే : ఎంపీడీవో



కేవీబీపురం, మే 19 ప్రభాతవార్త:

జలధార పనులు ప్రోగ్రాం ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కార్యక్రమం నిర్వహణ బాధ్యత ఇంజనీర్లదేనని ఎంపీడీవో మాలతి పేర్కొన్నారు. మంగళవారం కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సచివాలయ ఇంజనీర్లతో జలధారపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 1503 పనులు రాబడ్డాయని, అందులో 87 అక్కడ ఉన్నాయని ఈ జలధార పనుల్లో ఎలాంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఇంజనీర్లకు సూచించారు. ప్రతిరోజు ప్రోగ్రాంని తనిఖీ చేసేందుకు తమవంతు చర్యలు చేపడుతున్నామని, కావున ఎలాంటి పొరబాటు జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇంజనీర్లకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీర్లతో పాటు ఏపీవో భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అఖిలభారత కెమిస్టుల సమైక్య ఆలిండియా సమ్మెను విజయవంతం చేద్దాం

### - మెడికల్ అసోసియేషన్

కేవీబీ పురం, మే 19 ప్రభాతవార్త:

మండలకేంద్రమైన కేవీబీ పురంలో బుధవారం ఉదయం అఖిలభారత కెమిస్టుల సమైక్య ఆలిండియా సమ్మెకు మద్దతుగా ఆన్‌లైన్‌లో మందులు అమ్మకం నిలిపివేయాలని కార్పొరేట్ సంస్థలు నిలిపివేయాలని నకిలీ మందులు అమ్మకాని నివారించాలని మెడికల్‌షాపు యాజమాన్యాలు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పూడి గిరి కోరారు. మండలంలోని మెడికల్ స్టోర్ యాజమాన్యాలు తప్పకుండా హాజరు కావాలని, మండల కేంద్రంలోని అసోసియేషన్ కేఎల్‌ఎం క్లినిక్ అధినేత పూడి గిరి పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు.

## వేలంపాట ద్వారా పంచాయతీకి 2.48లక్షల ఆదాయం

చిన్నగొట్టిగల్లు మే 19 ప్రభాతవార్త



:చిన్నగొట్టిగల్లు పంచాయతీ లో నిర్వహించిన వేలంపాట ద్వార 2,48,300ల ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ గిడ్డయ్య తెలిపారు పంచాయతీ కార్యాలయం లో నిర్వహించిన వేలంలో వారపూసంత, ప్రైవేట్ బస్టాండ్, రూములకు ఒక సంవత్సరానికి మాత్రమే అని అన్నారు ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గిరిబాబు, వేలంపాట దారులు పాల్గొన్నారు

## అంగన్ వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

పులిచెర్ల, మే 19 ప్రభాతవార్త

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వాణి శ్రీదేవి ఆదేశాల మేరకు పులిచెర్ల ఐసిడియస్ ప్రాజెక్ట్ పులిచెర్ల మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడి కార్యకర్త, హెల్పర్స్ వివరాలు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవలెను వివరాలు పులిచెర్ల మండలంలో అంగన్వాడీ కార్యకర్త కల్లూరు 3 మెయిన్ అంగన్వాడి కార్యకర్త ఓసి, అంగన్ వాడి సహాయకులు చిగురమాకులపల్లి బిసి ఏ, దిగువ బెస్తపల్లి బిసి-ఏ, కమలాపురం ఎస్టి, ఊడగమాకులపల్లి బిసి - ఈ రిజర్వేషన్ గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అంగన్‌వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేయువారు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి, అభ్యర్థులు వివాహితులై స్థానికులై ఉండాలి, 01.07.2026 నాటికి దరఖాస్తు చేయు అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు పూర్తి అయ్యి 35 సంవత్సరాలలోపు వారై ఉండవలెను దరఖాస్తు చేయు అభ్యర్థులు అప్లికేషన్ పులిచెర్ల ఆఫీసు నందు విద్యార్హత సర్టిఫికెట్స్, కులం, నేటివిటి, ఇన్కమ్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఫోటోలు 2 జతపరిచి ఈ నెల 5వ తేది నుండి 28వ తేది సాయంత్రం 5 గంటలలోపు పులిచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి చేర్చాలన్నారు.

## కిశోరి బాలికలకు చట్టాలపై అవగాహన



పులిచెర్ల, మే 19, ప్రభాతవార్త

మండలంలోని పులిచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వెంకట దాసరిపల్లి సచివాలయంలో మంగళవారం కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పులిచెర్ల ప్రాజెక్టు సిడిపిఓ వాణి శ్రీదేవి మాట్లాడుతూ పిల్లలకు ఫోక్సో, బాల్య వివాహ నిషేధ చట్టం, గృహింస మొదలగు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలైతే 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేసుకోవాలని అలాగే మగ పిల్లలైతే 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని తెలియజేశారు . సమాజంలో జరిగే పిల్లలపై అభ్యుజస్ గురించి తెలియజేశారు వాటిని ఎలా నివారించాలి అనే విషయాలపై కూడా క్లుప్తంగా వివరించారు. విద్యాహక్కు చట్టం గురించి వివరిస్తూ 14 సంవత్సరాలలోపు పిల్లలందరూ కూడా బడిలోనే ఉండాలి అనే విషయాన్ని పిల్లలకు తెలియజేశారు. విద్యతో పాటు పిల్లలందరూ కూడా మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వాణిశ్రీదేవి ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని మహిళా పోలీస్ చరిత, ఏఎన్ఎం సహావరి, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు సుజాత సంపూర్ణ, శ్రీలత, భార్గవి పాల్గొన్నారు.

## ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన

తిరుపతి విద్య, మే 18 ప్రభాత వార్త

ఏపీపీజీసెట్-2026లో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పరీక్ష రాసిన విద్యార్థులు ఈ నెల 22, 23 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ శారీరక విద్య విభాగంలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని పీజీసెట్-2026 కన్వీనర్ ఆచార్య వి.పద్మావతి తెలిపారు.విద్యార్థులు గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన జాతీయ, రాష్ట్ర స్థాయి ఒరిజినల్ ధ్రువపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఆ ధ్రువపత్రాలకు మార్కులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని విద్యార్థులు తమ ర్యాంకును కోల్పోయే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

## స్విమ్స్‌లో పలు తాత్కాలిక పోస్టులకు జూన్ 1 నుండి 3వ తేదీ వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి హెల్త్, మే 19, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ఎవాల్యుయేషన్ ఆఫ్ క్యాన్సర్ అవేర్‌నెస్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ యాన్ ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ ఇన్ తిరుపతి డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ అనే ఎం.ఆర్.సి ప్రాజెక్టు లో తాత్కాలిక ప్రాదిపదికన పలు పోస్టుల కోసం 2026 జూన్ 1 నుండి 3వ తేదీ వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోస్టుల వివరాలు ఇలా వున్నాయి, మెడికల్ ఆఫీసర్ 1, స్టాఫ్ నర్సు 1, ఏ.ఎన్.ఎం 1, మామోగ్రఫీ టెక్నీషియన్ 1, కార్డియోవాస్క్యులర్ టెక్నీషియన్ గ్రేడ్॥ 01, డేటా ఎంట్రీ ఆపరేటర్ 01, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ 01, మెడికో సోషల్ వర్కర్ 01, ఎలక్ట్రీషియన్ 01, డ్రైవర్ 02, నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం హెచ్‌టిటిపిఎస్://స్విమ్స్ టిపిటి.ఏపినిక్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించగలరని కోరారు.

# తిరుపతిలో తిష్టవేసిన విద్య అక్రమార్కులు

## ఒకే పర్మిషన్‌తో పలుచోట్ల బ్రాంచీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు!

తిరుపతి విద్య, మే 19 ప్రభాత వార్త

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో విద్యాసంస్థల ముసుగులో జరుగుతున్న అక్రమాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. చట్టాలను, నిబంధనలను తుంగలో తొక్కుతూ కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు చెలరేగిపోతుంటే, వాటిని అడ్డుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతుల ఉల్లంఘనలు, అక్రమ బ్రాంచీల నిర్వహణ యథేచ్ఛగా సాగుతున్నా.. చూసీచూడనట్లు నటిస్తూ అధికారులు మాఫియాకు కొమ్ముకాస్తున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో తిరుపతి విద్యాశాఖలో జరుగుతున్న దోపిడీ, నిర్లక్ష్యంపై ప్రత్యేక కథనం:




ఐదో తరగతి అనుమతి.. పదో తరగతి వరకు అక్రమ బోధనలు తిరుపతి నగరంలో ప్రాథమిక విద్య పేరిట అనుమతులు పొంది, హైస్కూళ్లను నడపడం ఒక మాఫియాగా మారింది. కేవలం ఐదో తరగతి వరకే విద్యాశాఖ నుంచి అధికారిక పర్మిషన్ తీసుకుంటున్న కొన్ని ప్రైవేట్ సంస్థలు, లోపల మాత్రం యథేచ్ఛగా పదో తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నాయి. విద్యాశాఖ నిబంధనల ప్రకారం హైస్కూల్ నిర్వహణకు ఉండాల్సిన ఆటస్థలం, భవన వసతులు, అగ్నిమాపక అనుమతులు ఏవీ వీటికి ఉండవు. అయినప్పటికీ ఫీజుల దోపిడీ కోసం ఎలాంటి అర్హత లేని భవనాల్లో వందలాది మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. చట్టబద్ధమైన పత్రాలు లేకుండానే విద్యార్థులను చేర్చుకుంటూ, బోర్డు పరీక్ష ల సమయంలో ఇతర స్కూళ్ల పేరుతో హాల్ టికెట్లు మేనేజ్ చేస్తున్నారు. ఈ అక్రమ దందా అంతా బహిరంగంగానే సాగుతున్నా విద్యాశాఖ అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీ లీలలు దాగి ఉన్నాయి. తల్లిదండ్రుల నుంచి భారీ ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలను బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలపై తూతూమంత్రంగా విచారణలు జరిపి వదిలేస్తున్నారు.

### ఒకే పర్మిషన్‌తో నగరంలో వెలుస్తున్న అక్రమ బ్రాంచీలు

తిరుపతిలో సరికొత్తగా సాగుతున్న విద్యా దోపిడీ ఏంటంటే.. ఒక ప్రాంతంలో ఒక స్కూల్‌కు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. కానీ, అదే అనుమతి పత్రాన్ని (పర్మిషన్ ఆర్డర్ ) చూపిస్తూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో రెండు, మూడు దొంగ బ్రాంచీలను తెరుస్తున్నారు. చట్టప్రకారం ప్రతి బ్రాంచీకి విడివిడిగా స్థలం చూపిస్తూ, ప్రత్యేకంగా గుర్తింపు పొందాకే విద్యార్థులను చేర్చుకోవాలి. కానీ, ఆ నిబంధనలను నగరంలో ఎక్కడా అమలు చేయడం లేదు. ఒకే రిజిస్ట్రేషన్ నెంబర్‌తో బోర్డులు మార్చి వేర్వేరు చోట్ల దుకాణాలు నడుపుతూ పన్నులు, ఫీజుల దారి మళ్లిస్తున్నారు. ఈ తరహా మోసాలు తిరుపతి నలుమూలలా విస్తరిస్తున్నా అడ్డుకట్ట వేసే యంత్రాంగమే కరువైంది. అనుమతులు లేని భవనాల్లో వందలాది మంది విద్యార్థులను చేర్చుకుంటున్నా రాజకీయ, అధికార అండతో ప్రశ్నించే వారే లేకుండా పోయారు.

### లంచాల మత్తులో డి ఈ ఓ , డి వై ఈ ఓ , ఎం ఈ ఓల కంటితుడుపు చర్యలు

ఈ దారుణమైన నిబంధనల ఉల్లంఘన జిల్లా విద్యాశాఖాధికారి (డి ఈ ఓ), డిప్యూటీ ఈఓ (డి వై ఈ ఓ), మండల విద్యాశాఖాధికారులకు (ఎం ఈ ఓ) పూర్తిగా తెలిసినప్పటికీ వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఇచ్చే నెలవారీ మామూళ్లకు అలవాటుపడి, కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాల్సిన అధికారులు ఏనాడూ ఈ అక్రమ స్కూళ్ల గడప తొక్కకపోవడం వారి అంతర్గత ఒప్పందాలను స్పష్టం చేస్తోంది. అక్రమ పాఠశాలలపై ప్రజల నుండి, తల్లిదండ్రుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తినా, కేవలం నోటీసుల పేరుతో, కంటితుడుపు హెచ్చరికలతో కాలయాపన చేస్తూ కాలం గడుపుతున్నారు. అధికారుల ఈ అండదండల వల్లే అక్రమార్కులు మరింత తెగించి, ఎలాంటి భయం లేకుండా క్లాసులు పెంచుకుంటూ పోతున్నారు. ప్రభుత్వ జీతాలు తింటూ, ప్రైవేట్ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఈ అధికారుల తీరు విద్యా వ్యవస్థకే శాపంగా మారింది.

### కనీస మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు గాలికొదిలిన స్కూళ్లు

చాలా ప్రైవేట్ స్కూల్స్‌లో ఫైర్ సేఫ్టీ, సరైన తరగతి గదులు, ఆట స్థలాలు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని ఆరోపణలు ఉన్నాయి. కనీస భద్రతా ప్రమాణాలు లేని ఇరుకు గదుల్లో విద్యార్థులను గొర్రెల మందల్లా కుక్కి చదువు చెప్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పిల్లలు బయటకు వెళ్లేందుకు సరైన మార్గాలు కూడా లేకపోవడం తల్లిదండ్రులలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ విద్యార్థుల ప్రాణాలకు జవాబుదారీ ఎవరు అనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. యాజమాన్యాలు కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని, పిల్లల ప్రాణాలను పణంగా పెడుతూ తల్లిదండ్రులను నమ్మించి మోసం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మేల్కొనని విద్యాశాఖ, రేపు ఏదైనా అనర్థం జరిగితే కానీ బాధ్యత తీసుకోదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### విద్య పేరుతో కార్పొరేట్ సంస్థల ఉచ్చు.. భారీ ఫీజుల దోపిడీ

తిరుపతిలో విద్య అనేది సేవ కాకుండా పూర్తిగా వ్యాపార కేంద్రంగా మారిందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కలర్‌ఫుల్ బ్రోచర్లు, ఏసీ రూములు, అబద్ధపు ఫలితాల ప్రచారాలను నమ్మి తల్లిదండ్రులు లక్షలాది రూపాయల ఫీజులు, డొనేషన్లు కట్టి మోసపోతున్నారు. స్కూల్ బోర్డుల మీద గుర్తింపు పొందినది అని తప్పుడు రాతలు రాస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. విద్యార్థుల చేరికల సమయంలోనైనా విద్యాశాఖ తగిన అవగాహన కల్పించకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఫలితాల పేరుతో విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తీసుకువస్తూ వారి భవిష్యత్తుతో ప్రమాదకర ఆటలు ఆడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దళాలతో విస్తృత తనిఖీలు నిర్వహించి, విద్యా రంగంలో పారదర్శకత తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## సుబ్రమణ్యం స్వామికి ప్రత్యేక అలంకారాలు



శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు ఆలయంలో సుబ్రమణ్యం స్వామి ఆలయాలు వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాల యంలో వళ్ళి దేవసేన సమేత చెంగల్వరాయస్వామి ఆలయం ఉంది. ఇక్కడ మంగళవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఇక బిక్షాల గాలిగోపురం నుంచి ప్రవేశించిన వెంటనే రంగుల గోపురం వద్ద వళ్ళి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయం ఉంది. అలాగే ప్రత్యేకంగా కుమారస్వామి తిప్పపై సుబ్రమణ్యం స్వామి వెలసి ఉన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని పలు చోట్ల సుబ్రమణ్యం స్వామి ఆలయాలు ఉన్నాయి. ఈనేపధ్యంలో తేరువీధిలో షణ్ముఖ స్వామి ఆలయం వెలసి ఉంది.ఇక్కడ ప్రతి మంగళవారం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. షోడషాభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## తుడా చైర్మన్ దివాకర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి విద్య, మే 19 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి, తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో సభ్యుడు, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డికి పీహెచ్‌డీ డిగ్రీ ప్రధానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి. రాజమాణిక్యం తెలిపారు.ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు ప్రొఫెసర్ జి.సవరయ్య పర్యవేక్షణలో, సహ పరిశోధన మార్గదర్శకురాలు ప్రొఫెసర్ ఆర్. సునీత మార్గదర్శకత్వంలో దివాకర్ రెడ్డి తన పరిశోధనను పూర్తి చేశారు. చిత్తూరు జిల్లాలో కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు – ఒక అధ్యయనం అనే సామాజిక ప్రాధాన్యత కలిగిన అంశంపై ఆయన సుదీర్ఘంగా పరిశోధన నిర్వహించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 312 మంది కౌలు రైతుల కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అప్పుల భారం, పెట్టుబడులు, ప్రభుత్వ పథకాల లబ్ధి వంటి అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించారు.ఈ పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు అధికారులు తెలిపారు.పరిశోధనా కాలంలో డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి రచించిన పలు పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. రాజకీయ, సామాజిక బాధ్యతల్లో బిజీగా ఉంటూనే సమాజానికి ఉపయోగపడే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం పట్ల విశ్వవిద్యాలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

## ఉరి వేసుకుని వ్యక్తి మృతి!

తొట్టంబేడు, మే 19 ప్రభాతవార్త : ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొట్టంబేడు మండలం తంగేడు పాలెం వద్ద చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్సై బి.బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి శాంతల మహేష్, వయసు 23 సంవత్సరాలు, తల్లి పేరు శాంతల దీప, వీరు తంగేడు పాలెం గ్రామంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఫిర్యాదుదారు శాంతల దీప ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె కుమారుడు మహేష్ తన బావ బాలాజీ పుట్టిన వెంటనే మరణించిన మేనల్లుడు మృతి చెందిన బాధను జీర్ణించుకోలేక మానసికంగా కలత చెందుతూ తరచూ మద్యం సేవిస్తూ ఉండేవాడని తెలిపినది. మంగళవారం ఉదయం సమయంలో మహేష్ తన తల్లి వద్దకు వచ్చి రూ.50 తీసుకొని వెళ్ళాడన్నారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో శ్రీనివాసులు అనే పరిచయస్తుడు ఫిర్యాదుదారుకు ఫోన్ చేసి, మహేష్ ఈ బాధను భరించలేక పోతున్నాను నేను చచ్చిపోతాను అని ఫోన్‌లో చెప్పినట్లు సమాచారం. దీనితో పక్కింటి వారైన పావని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు మహేష్ ఉంటున్న ఇంటి తలుపు లోపల నుండి గడియ పెట్టి ఉండగా, ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతూ ఉన్నాడని తెలిపారు. వెంటనే ఫిర్యాదుదారు సంఘటనా స్థలానికి చేరుకొని, ఏరియా ఆసుపత్రికి తరలించగా, డ్యూటీ డాక్టర్ పరిశీలించి అప్పటికే మరణించినట్లు నిర్ధారించినాడు. కేసుగా నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సులో యువకుల హల్‌చల్

### నాగలాపురం బస్టాండ్ వద్ద నిలిచిన బస్సు

నాగలాపురం, మే 19 ప్రభాతవార్త: సత్యవేడు నుంచి తిరుపతికి బయలుదేరిన ఆర్టీసీ బస్సులో నాగలాపురం ఈస్ట్ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు మద్యం సేవించి ఎక్కి అల్లర్లు సృష్టించారు.




వారి ప్రవర్తనతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బస్సులో గందరగోళం సృష్టిస్తున్న యువకులను గమనించిన డ్రైవర్, మద్యం సేవించి ఉన్నారని వెంటనే బస్సు దిగిపోవాలని ఆర్టీసీ బస్సు డ్రైవర్ హెచ్చరించారు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు బస్సు వెనుక భాగంలోని టైర్‌లోని గాలిని తీసివేసి, మేము లేకుండా బస్సు ఎలా వెళుతుందో చూస్తాం అంటూ డ్రైవర్‌ని బెదిరించినట్లు డ్రైవర్ తెలియజేశారు. ఈ ఘటనతో బస్సు నాగలాపురం బస్టాండ్ వద్దే నిలిచిపోయింది. అనంతరం బస్సు డ్రైవర్ నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సునీల్ ఘటనపై స్పందించి అల్లర్లకు పాల్పడిన యువకులను పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. పునరావృతమైతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్‌లో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఎస్ఐ హెచ్చరించారు. అదే విధంగా బస్సు టైర్‌లోని గాలి తొలగించడం వల్ల వచ్చిన ఖర్చులను యువకుల వద్ద నుంచి వసూలు చేసినట్లు తెలియజేశారు.

## గంజాయి రహిత సమాజ స్థాపనే లక్ష్యం

### -రేణిగుంటలో డ్రగ్స్ పై దండయాత్ర 2.0

తిరుపతి/రేణిగుంట,మే 19ప్రభాతవార్త: డ్రగ్స్ నియంత్రణపై దండయాత్ర 2.0 కార్యక్రమం మంగళవారం రేణిగుంటలో నిర్వహించారు. గంజాయి అలవాటు ఉన్న అనుమానితులకు ప్రత్యేక బయోచెక్ట్ కిట్ల ద్వారా డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు, గంజాయి విక్రయించేవాళ్ళు, అలాగే వినియోగదారుల వివరాలను సేకరించి వారిని పిలిపించి ఎన్టీఆర్ కూడలి వద్ద పరీక్షలు నిర్వహిస్తున్నారు.



అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను బయోచెక్ట్ కిట్ల ద్వారా పరీక్షించి గంజాయి వినియోగిస్తున్నారా, అనేది నిర్ధారిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి ద్వారా గంజాయి విక్రయ ముఠాలకు సంబంధించిన లింకులను గుర్తించి సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకునేలా చూస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రేతలు వినియోగదారుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. గంజాయికి బానిసలైన వారిని ఆ అలవాటు నుంచి దూరం చేసేందుకు వారి తల్లిదండ్రుల సమ్మతితో కౌన్సిలింగ్ చేస్తున్నామన్నారు. పాపానాయుడుపేటలోని రాష్ట్ర పునరావాస కేంద్రం, స్విమ్స్ రుయా ఆసుపత్రిలోని డీఅడిక్షన్ సెంటర్ల ద్వారా వారికి పునరావాస సేవలు అందించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని వివరించారు.సమాజంలో గంజాయి మహమ్మారిని నిర్మూలించేందుకు ఇలాంటి తనిఖీలు డ్రగ్ పరీక్షలు నిరంతరం కొనసాగుతాయని, గంజాయి రహిత సమాజ స్థాపనే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సీఐ జయచంద్ర ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ సంస్థకే కుచ్చుటోపి పెడుతున్న...

## మంగంపేట ముగ్గురాయి మాఫియా!




ఓబులవారిపల్లి, 19 మే ప్రభాతవార్త: ఇండియాలో ఉన్న అతి పెద్దదైన ఏకైక ప్రభుత్వానికి సంబంధించిన ఆయిల్ రిఫైనింగ్ కంపెనీకి సరఫరా చేయాల్సిన ముగ్గురాయి, నాణ్యత కలిగి ఉన్న పౌడర్ ఓఎన్జిసి సంస్థకు మంగంపేట నుంచి కొన్ని మిల్లులు ద్వారా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే సరఫరా చేయాల్సిన విషయంలో మంగంపేట ముగ్గురాయి మాఫియా డాన్లు 1.0 గ్రావిటీకి టెండర్ పిలిస్తే, అందరూ సిండికేట్ ముగ్గురాయి మాఫియా వ్యాపారస్తులు సిండికేట్ గా మారి, గత 20 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినటువంటి, ఓఎన్జిసి సంస్థకు సీ గ్రేడ్ పౌడర్, మెటీరియల్ సరఫరా చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లేటట్లు, నాసిరకం పౌడర్ సరఫరా చేస్తున్నారని పలువురు విమర్శిస్తూ ఆరోపిస్తున్నారు. సంస్థకు కోట్ల రూపాయలు నష్టం కొందరు వ్యాపారాలు చేస్తూ అధికారులతో లోపాయకార ఒప్పందాల కుదురుచుకొని, నాసిరకం పౌడర్ మిక్స్ చేసి ఎగుమతి చేస్తున్నట్లు విశ్వసినీ సమాచారం. ఇదే తంతు కొన్ని సంవత్సరాలుగా జరుగుతూ ఉండడంతో ఓఎన్జిసితో జతకట్టి వ్యాపారం చేస్తున్న మంగంపేట ముగ్గురాయి మాఫియా హోటల్ లాభాలు బాటలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. వీటిపై సమగ్ర విచారణ చేపట్టాల్సిన ప్రభుత్వ అధికారులు, ఈ సిండికేట్ వ్యాపార సామ్రాజ్యం వాదులు అందించే ముడుపులకు దాసోహమై, వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా వ్యాపారం సాగిస్తున్నప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తూ అన్ని కాడికి దండుకుంటున్నారని ఆరోపణలు నిండుగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు ఇలాగే ఉంటే కేంద్ర ప్రభుత్వ సంస్థకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లి నష్టాలు బాటలు పయనించడం తప్పదని, అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థకే ఇచ్చుటోపి పెట్టి ఉరిడీ కొట్టిస్తున్నారని విమర్శలు వినపడుతున్నాయి. నాసిరకం పౌడర్ ఎగుమతులపై సిబిఐ విచారణ చేపట్టి ప్రభుత్వానికి న్యాయం చేయాలని అటు ప్రజలు బిజెపి నాయకులు. కార్మిక నాయకులు ప్రజాసంఘాలు ఆర్థిక విశ్లేషకులు సంబంధిత అధికారులు కోరుతున్నారు. అంతేకాకుండా, పౌడర్ గ్రావిటీ 4.10 పౌడర్ రావాల్సి ఉండగా 3.9 ముగ్గురాయి పౌడర్ గ్రావిటీ మిల్లర్ల ద్వారా ఆడుతూ నాసిరకం సి గ్రేడ్ పౌడర్లు బి గ్రేడ్ గ్రావిటీ వచ్చేలా కొంత నాసిరకం పౌడర్ ఆడుతూ మిషన్ల ద్వారా చెకింగ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం అయినటువంటి ఓఎన్జిసి సంస్థకు ఎగుమతి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ఇలాంటి మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకొని కేంద్ర ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని పలువురు ఆర్థిక విశ్లేషకులు బిజెపి నాయకులు ప్రజలు కోరుతున్నారు.

## దళిత ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి: ఎమ్మెల్యే



దళిత వాడలో యువతతో మమేకమైన ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి రూరల్,మే 19 ప్రభాతవార్త: రాష్ట్రాన్ని ఐదేళ్ల పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వవెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఆయన దళిత వాడల్లో పర్యటించారు. ఊరందూరు గ్రామ దళిత వాడలో పర్యటించిన ఆయన దళిత యువతతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు సాగిన జగన్‌రెడ్డి పాలనలో దళితుల చరిత్రలో ఓ చీకటి అధ్యాయం అన్నారు.దళిత ద్రోహిగా మారిన జగన్ ఐదేళ్ళ పాటు దళితుల హక్కులను కాలరాస్తూ వారి సంక్షేమ పథకాలను రద్దు చేయటమే కాకుండా సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించి కోలుకోలేని ద్రోహం చేసారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ వేధింపులను తట్టుకొని నిలబడిన దళిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందన్నారు. దళిత వాడలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

**సబ్‌ప్లాన్‌తో దళిత వాడల అభివృద్ధి:**

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని దళిత వాడలను ప్రభుత్వం మంజూరు చేస్తున్న సబ్‌ప్లాన్ నిధులతో దళిత వాడల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో దళిత వాడలకు మహర్ధశ కల్పించుటకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సబ్‌ప్లాన్ నిధులను కూడా స్వాహాచేసారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రవీంద్రరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయాదవ్, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, బత్తిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, దళిత యువత తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఘటా కుండం ఊరేగింపు



వడమాలపేట, మే 19 ప్రభాతవార్త: వడమాలపేట గంగజాతరలో భాగంగా మంగళ వారం పోతురాజుకు పూజలు నిర్వహించి ఘటా కుండంను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మం గళవారం ఉదయం పోతు రాజుని ప్రతిష్టింప చేసి అంబళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాయిద్యాలతో ఘటా కుండంను బజారువీధిలో ఊరేగింపుగా వెళ్లారు. ఇంటింటా ఘటా కుండంలో అంబలి పోసి, నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళలు మహాలక్ష్మి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. రాత్రి గాలి గంగమ్మను వేపాకు మండలతో తోలుతూ కుమ్మరి వారి ఇంటి నుంచి సారె తీసుకొచ్చి మట్టితో గంగమ్మ ప్రతిమను తయారు చేశారు. జాతరసందర్భంగా గ్రామంలోని అన్ని వీధులు వేపాకు తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం వేకువ జామున అమ్మవారిని ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. బస్టాండ్ కూడలి నడివీధిలో ప్రతిష్టింపచేస్తారు. స్థానిక ప్రజలు కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. వడమాలపేటలో గంగజాతర సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాలు వడమాలపేటకు రాకుండా బైపాస్‌లో వెళ్తాయని ప్రయాణికులు గుర్తించుకోవాలని ఆయన తెలిపారు.

## 20న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు శివయ్యకు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం లెక్కింపుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఇఒ బికె వవెంకటేశులు తెలిపారు. ఉదయం 7గంటలకు రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించే మండపం వెనుక మందుకొట్టు మండపంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తిరుపతి జిల్లా దేవాదాయశాఖ అధికారి సమక్షంలో నిర్వహించబడుతుందని వివరించారు.

## పరశురామేశ్వరుని సన్నిధిలో మహారాష్ట్ర విద్యార్థులు




ఏర్పేడు,మే 19 ప్రభాతవార్త: మండలం గుడిమల్లం ఆలయంలో వెలసిన అనందవల్లి సమేత పరశు రామేశ్వరుని సన్నిధిలో మంగళవారం తిరుపతి, మహారాష్ట్ర ఐఐటి విద్యార్థులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మెన్ బత్తలగిరి బాబునాయుడు,ఇఒ మునిశేఖర్, వేదపండితులు తులసీశర్మల స్వాగతం పలికారు.ఈసందర్భంగా విద్యార్థులకు పరశురామమే శ్వరుని ఆలయ చరిత్రను పురావస్తుశాఖలో ప్రాధాన్యతను వివరించారు. భారత దేశంలో మొదటి శివాలయంగా చెబుతున్న పరశురామేశ్వరాలయంలో వెలసిన లింగం గురించి ఆలయ నిర్మాణ చరిత్ర గురించి వివరించారు. దర్శనానంతరం వారికి స్వామి అమ్మవార్ల తీర్ధ ప్రసాదాలను అందించారు.

## ఆరునెలల కాపురం...హాస్టల్‌లో వదలేశాడు!

### -న్యాయం కోసం యువతి ఆక్రందన



శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త: ప్రేమ పేరుతో నమ్మించాడు. తల్లిదండ్రులను కాదని ప్రేమ మత్తులో ప్రేమించిన యువకునితో వచ్చేసింది. ఆరునెలల కాపురం చేసిన తరువాత నమ్మి వచ్చిన యువతిని ఓ ప్రైవేటు హాస్టల్‌లో వదలి పెట్టి ఉడాయించిన ఓ ఘనుడి ఆచూకి కోసం ఆ యువతి ఆక్రందన వర్ణనాతీతంగా మారింది. మహిళా పోలీసు స్టేషన్‌కు వెళితే కనీస గౌరవం లేకుండా అసభ్యంగా మాట్లాడుతున్నారంటూ కన్నీటి పర్యంతం. వివరాల్లోకి వెళితే పూతలపట్టు గ్రామానికి చెందిన ముస్లిం యువతి నాజుని శ్రీకాళహస్తికి ఎస్‌డికె నగర్‌కు చెందిన వినయ్‌కుమార్ అనే వ్యక్తిని ప్రేమించింది. తల్లిదండ్రులను కాదని వివాహం చేసుకున్నట్లు వివరించారు. ఆరు నెలలు శ్రీకాళహస్తిలోని వివిధ ప్రాంతాలలో కాపురం చేసామని వివరించింది. వినయ్‌కుమార్ తల్లిదండ్రులు ఆతన్ని దాచి పెట్టి ఆతని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు తనకు దిక్కుతోచని స్థితిలో వినయ్‌కుమార్ ఇంటికి వెళ్ళి తన భర్తను తనకు అప్పగించమని ఇంటి వద్ద బైటాయించినట్లు తెలిపారు. అయితే ఇంటి యజమాని అడ్డురాగా ఇంటి ఓనర్‌ను దుర్భషలాడుతూ వినయ్‌కుమార్ నివాసముంటున్న ఇంటి అద్దాలు పగులగొట్టి తన భర్త తనకు కావాలంటూ బైటాయించి నిరసన తెలిపింది. తనకు జరిగిన అన్యాయం గురించి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోం శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని నాజునీ మీడియాకు వివరించారు.

## నాన్‌టీచింగ్ ప్రమోషన్లపై...ఎందుకింత ఉదాసీనత?



శ్రీకాళహస్తి రూరల్,మే 19 ప్రభాతవార్త: ఇంటర్ ఎడ్యుకేషన్ నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆదివారం ఇంటర్మీడియేట్ ఎడ్యూకేషన్ ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షులు కందాటి విశ్వేరరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యలను పరిష్కరిస్తుందని కానీ విద్యాశాఖను ప్రజలకు దగ్గర చేస్తున్న యువ మంత్రి నారా లోకేష్ చిరుద్యోగుల సమస్యలను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ శాఖలో అటెండర్ నుంచి రికార్డు అసిస్టెంట్ వరకు ప్రమోషన్లలో తీవ్ర జాప్యం జరుగుతుం దన్నారు. 10శాతం జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్లు, 20శాతం జూనియర్ లెక్చరర్స్ ఇన్ లైబ్రరీ, 25శాతం జూనియర్ లెక్చరర్స్ ఇన్ ఒకేషనర్ కోర్సు నాన్‌టీచింగ్ స్టాఫ్ నుంచి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారులకు విన్నవించినట్లు విశ్వేశ్వరయ్య కోరారు.

## ప్రభుత్వ పాఠశాల...తల్లి ఒడి వంటిది

ఏర్పేడు, మే 19 ప్రభాతవార్త : కందాడులో బడి పిలుస్తోంది ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాలను ఏర్పేడు ఎంఈవోలు ప్రేమలత, దయాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం కందాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు బడి పిలుస్తోంది కార్యక్రమాలను తల్లి దండ్రుల భాగస్వామ్యంతో నిర్వహించారు. బడి ఈడు పిల్లల నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కందాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, కందాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధీర్, ఉపాధ్యాయులు శ్రీధర్ రావు , కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## సుందరయ్య స్ఫూర్తి...ఉద్యమాలకు నాంది



శ్రీకాళహస్తి, మే 19 ప్రభాతవార్త: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలకాలని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి జోహర్లు అర్పించారు. తదనంతరం మణి మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయమన్నారు. పెనగడం గురవయ్య, కత్తి రమణయ్య, రెడ్డిపల్లి సురేష్, లతారెడ్డి, రాధమ్మ, వెంకటేష్, సంక్రాంతి వెంకటయ్య, అన్వర్ బాషా, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితుల స్మశాన భూమి ఆక్రమణ!



శ్రీకాళహస్తి రూరల్, మే 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి రూరల్ మండలం మాధవమాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 51లో ప్రభుత్వం దళితుల స్మశానం కోసం కేటాయించిన భూమిని ముచ్చివోలుకు చెందిన ఓ రైతు ఆక్రమిం చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 51లో మొత్తం 11.66 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 1.50 ఎకరాలను మాధవమాల హరిజనవాడ శ్మశానం పేరుతో కేటాయించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, స్మశానం కోసం కేటాయించిన 1.50 ఎకరాల స్థలంలో కొంత భాగాన్ని ముచ్చివోలు గ్రామానికి చెందిన రైతు ఆక్రమించి జెసిబితో చదును చేశాడు. దీనిని గమనించిన దళితులు అతడిని ప్రశ్నించగా, వారిపై ఎదురుదాడికి దిగుతూ మీ మీదే కేసులు పెడతాను అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శీనయ్య విధేయత కలిగిన కార్యకర్త

తొట్టంబేడు, మే 19 ప్రభాతవార్త: తిరుపతి పార్లమెంట్, శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం దిగువ కొనతనేరి పంచాయితీ గుర్రప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన శీనయ్య అనారోగ్యంతో బాధపడుతూ గత నెల రోజులుగా తిరుపతిలోని సిమ్స్ హాస్పిటల్ నెల్లూరులోని హాస్పిటల్ నందు చికిత్స పొందిన ప్రయోజనం లేకపోవడంతో స్వగ్రామమైన గుర్రప్ప నాయుడు కండ్రికకు తీసుకొని రావడంతో తుది శ్వాస విడవడం జరిగింది. శీనయ్య భౌతిక కాయానికి మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, కొనతనేరి ఆయకట్టు అధ్యక్షులు లెక్కల వెంకట ముని నాయుడు, మాజీ ఎంపీటీసీ భాస్కరయ్య, బూత్ ఇంచార్జ్ లెక్కల మురళి నాయుడు, లెక్కల సుధాకర్ నాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ప్రజా సమస్యలపై పోరాడండి: షర్మిలారెడ్డి



శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలతో ప్రజల మధ్య ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి సూచించారు. రాష్ట్ర పార్టీ సమావేశం మంగళవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి,శ్రీకాళహస్తి నియోజక వర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలకు దిశ దెశ నిర్దేశం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఉన్నారన్నారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన నాయకులు షర్మిలా రెడ్డిని శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాల గురువం బాబు, తిరుపతి నగర పార్టీ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం, రమేష్‌రెడ్డి,హరిబాబులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ నగర్‌లో గంగమ్మజాతర





శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతరను అంగరంగ వేభవంగా నిర్వహించారు. అ సందర్భంగా జాతరలో నాయకుల సందడి చోటు చేసుకుంది. ఎన్‌టి నగర్‌లో అమ్మవారిని చక్కగా అలంకరించారు. గ్రామోత్సవం నిర్వహించారు. స్థావరం వద్ద అమ్మవారిని మూల విరాట్టును వైకాపా నాయకులు దర్శించుకున్నారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సతీమణి బియ్యపు వాణి అమ్మవారికి భక్తి శ్రద్దలతో సారెను అందించారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ప్రాంతానికి చెందిన నాయకుడు శివాయాదవ్ సారధ్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికారు. శ్రీనివాసులుతో పాటు వయ్యాల కృష్ణారెడ్డి, మైనారిటి నాయకులు పఠాన్ ఫరీద్‌ఖాన్,శివకుమార్ యాదవ్, మున్నారాయల్, బావాజి,సురేష్, గాంధీ, జివికె రెడ్డి,ప్రవీణ్,తరుణ్, అభిషేక్,మోహన్, సూర్య కల్లి, షమీర్, బాలాజిరెడ్డి,రెడ్డిబాషా, చంచయ్య, శీను భాను సురేష్, యశ్వంత్ రెడ్డి, చందూ,వల్లంగోపి యోగి యాదవ్, మోహన్‌నాయుడు, పసల కృష్ణయ్య, అభిషేక్ రవిన్ యాదవ్,సూరి,మధు,యాకూబ్ సుధీర్,సాయి,ప్రసాద్ తదితరులు న్నారు.